RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 219 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 ఆగస్టు 2024 శనివారం పేజీలు : 4

## త్వరలో రాహుల్ 'డోజో' యాత్ర!

న్యూఢిల్లీ : కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు భారత్ జోడో యాత్ర, మణిపూర్ నుంచి ముంబై వరకు భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. త్వరలో భారత్ 'డోజో' యాత్ర చేపట్టనున్నారు.

ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. డోజో అనేది మార్షల్ ఆర్ట్స్ నేర్పే స్కూలు లేదా మైదానం. న్యాయయాత్ర సందర్భంగా రోజూ సాయంత్రం తాను బస చేసిన శిబిరం వద్ద ప్రత్యేకంగా కార్యకర్తలతో కలిసి రాహుల్ జియు-జిత్సు ఆర్ట్‌ను ప్రాక్టీసు చేసేవారు. ఆ వీడియోను ఆయన పోస్టు చేశారు. జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకున్న ప్రజలతో తన అనుభవాలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. 'భారత్ డోజో యాత్ర త్వరలో రాబోతోంది' అని పేర్కొన్నారు.



# శనివారం టెన్షన్!

## హైడ్రా బుల్‌డోజర్ నేడు పయనమెటో?

## రూట్ మాప్ అదేనా?

హైదరాబాద్ : హైడ్రా అంటేనే నగరంలో దడ మొదలయింది. సంపన్నుల నుంచి మధ్యతరగతి ప్రజల వరకూ భయపడిపోతున్నారు. హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేతలను ఆపడం లేదు. ప్రతి రోజూ ఏదో ఒక చోట కూల్చివేతలను జరుపుతూనే ఉంది. కొందరికి నోటీసులు ఇచ్చి హైడ్రా కూల్చి వేతలు జరుపుతుండగా, మరికొందరికి మాత్రం నోటీసులు ఇవ్వకుండానే అక్రమ నిర్మాణమని తేలితే చాలు కూల్చివేయడం మొదలుపెట్టేస్తుంది. శని, ఆదివారాలు హైడ్రా బుల్‌డోజర్లు ఉదయాన్నే బయలుదేరి కూల్చివేతలను ప్రారంభించనున్నాయి. గత కొన్ని రోజులుగా ఇదే జరుగుతుంది. దీంతో శనివారం అంటేనే నగర వాసులు భయపడిపోతున్నారు.

**ఎవరినీ వదలకుండా...** హైడ్రా అధికారులు ఎవరినీ వదలడం లేదు. చివరకు ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి నివాసానికి కూడా నోటీసులు అంటించారు. 30 రోజుల్లో కూల్చేవేయాలని ఆదేశించారు. చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను మాత్రమే తొలగిస్తున్నారు. దీంతో కొందరు ముందస్తుగా న్యాయస్థానానికి వెళ్లి స్టే ఆర్డర్స్ తెచ్చుకుంటున్నారు. దీంతో శని, ఆదివారాలు కోర్టులకు సెలవు దినాలు కావడంతో ఆరోజు హైడ్రా బుల్ డోజర్ వేగంగా పనిచేస్తుంది. అన్ని శాఖ అధికారులు సమన్వయంతో ఈ కూల్చివేతల కార్యక్రమాన్ని చేపట్టారు. బుల్ డోజర్ బయలుదేరే వరకూ ఇతర శాఖల అధికారులకు గాని, సిబ్బందికి గాని సమాచారం తెలియనివ్వకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**ఆక్రమణదారులకు...** సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ తో పాటు పెద్దోళ్ల నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో ఎవరినీ వదలబోమన్న సంకేతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ బలంగా ఇచ్చారు. అయితే ఈ శనివారం హైడ్రా బుల్‌డోజర్ ఎటు బయలుదేరుతుందోనన్న టెన్షన్ ప్రతి ఒక్కరిలోనూ ఉంది. ఇప్పటికే నోటీసులు ఇచ్చిన వారితో పాటు ఆక్రమించి భవనాలను నిర్మించుకున్న వారి గుండెల్లో బుల్‌డోజర్ పరుగులు తీస్తుంది. హైడ్రాకు ఫిర్యాదులు కూడా పెద్ద సంఖ్యలో వస్తుండటంతో వాటిని పరిశీలించి ఆక్రమణలను అని నిర్ధారించుకున్న తర్వాతనే కూల్చివేత ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా హైడ్రా తీసుకుంటున్న చర్యలు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**43 ఎకరాలను...** గత నెల రోజుల్లో హైడ్రా అనేక నిర్మాణాలను కూల్చివేసింది. దాదాపు 43 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ లో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే. రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారుల అవినీతి కారణంగా కొన్ని దశాబ్దాల నుంచి ఇష్టమొచ్చినట్లు ఆక్రమణలకు గురి చేశారు. నాలాలు మూసుకుపోయాయి. చెరువులు మాయమయ్యాయి.

దీంతో వర్షం పడితే చాలు హైదరాబాద్ భయంకరంగా మారిపోతుంది. రోడ్ల మీదనే నీరు నిలిచిపోతుంది. అందుకే ప్రభుత్వం హైడ్రాను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

దీనికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ ప్రజల నుంచి మద్దతు వస్తుండటంతో వాటికి బ్రేకులు పడటం లేదు. మరి శనివారం హైడ్రా బుల్‌డోజర్ పయనమెటో?

## ఓవైసీ వార్నింగ్ ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోంది

హైదరాబాద్: హైడ్రాతో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రామాకు తెరలేపిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. నాగోల్ శుభమ్ కన్వెన్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదుపై వర్క్ షాప్ జరిగింది. దీనికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అన్ని మోర్చాల అధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. బీజేపీ వర్క్ షాపులో బండి సంజయ్ హాట్ కామెంట్స్ చేశారు. ఆక్రమణల కూల్చివేతలకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం



చేశారు. హైడ్రా పేరుతో పేదలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎన్ కన్వెన్షన్ ను కొట్టి.. కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడి చేసిందన్నారు. సల్కం చెరువులో బిల్డింగులు కట్టామని స్వయంగా ఓవైసీ చెప్పాడన్నారు. ఓవైసీ వార్నింగ్ ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందన్నారు. ఓవైసీ బ్రదర్స్ ఆక్రమణలు తొలగించాకే ఇతర భవనాల జోలికి వెళ్లాలని బండి సంజయ్ పేర్కొన్నారు.

తాను కేంద్ర మంత్రి అవుతానని కలలో కూడా ఊహించలేదని బండి సంజయ్ తెలిపారు. సామాన్య కార్యకర్తను కేంద్రమంత్రిని చేసిన ఘనత బీజేపీదేనని పేర్కొన్నారు.




ఒవైసీ బ్రదర్స్‌కు రిలీఫ్ లభించింది. విద్యాసంస్థల కూల్చివేతల విషయంలో తొందరపడొద్దని, నిబంధనలకు లోబడే కూల్చివేతలు ఉండాలని హైకోర్టు హైడ్రాకు తెలిపింది. అలాగే పల్లా, మర్రి కాలేజీలకు హైకోర్టులో ఊరట లభించింది. తమ విద్యాసంస్థల కూల్చివేతలు ఆపాలంటూ హైకోర్టుకు వెళ్లారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి. కాలేజీలను కూల్చివేస్తే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారని.. విద్యా సంవత్సరం దెబ్బతింటుందని కోర్టును కోరారు పల్లా. దీంతో కూల్చివేతలు ఆపాలంటూ హైకోర్టు తీర్పు వెలువరించింది. తదుపరి తీర్పు ఇచ్చే వరకు ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని పేర్కొంది. ఫాతిమా కాలేజీకి కూడా ఇదే తీర్పు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఫాతిమా కాలేజీ బఫర్ జోన్‌లో ఉందంటూ హైడ్రా నోటీసులు ఇచ్చిన సంగతీ తెలిసిందే. మరోవైపు కాలేజీల కూల్చివేతపై ఆచితూచి వ్యవహరిస్తామని సీఎం రేవంత్, హైడ్రా కమిషనర్ చెప్పారు. దీంతో ఒవైసీ బ్రదర్స్‌కు ఊరట లభించే అవకాశం ఉంది.

## నోటీస్ ఇవ్వకుండా.. ఇళ్లు కూల్చమని చట్టంలో ఉందా

హైదరాబాద్: తనకు శత్రువులు ఎవరూ లేరని.. తనపై ఎవరు కుట్ర చేస్తారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. నేడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహబూబ్ నగర్‌లోని అంధుల కాలనీలో అర్ధరాత్రి 400 మంది పోలీసులు వెళ్లి అంధుల ఇళ్లు కూల్చివేశారన్నారు. అంధులు వేడుకున్నా కూడా పోలీసులు వారిని వదలలేదన్నారు. తమ సామాగ్రిని తీసుకుంటామని బ్రతిమిలాడినా సమయం ఇవ్వలేదని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు



ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీళ్లు ఇచ్చిందన్నారు. నాలుగేళ్ల పాటు పెన్షన్ డబ్బులతో చిట్టీలు వేసుకొని ఇల్లు నిర్మించుకున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పట్టాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంధుల కాలనీలో చెరువు కానీ.. కుంట కానీ లేదని.. అది కోట్లు విలువ చేసే భూమి కూడా కాదన్నారు. అయినా కూడా అంధుల ఇళ్లను కూల్చేశారన్నారు. బడాబాబులకు 30 రోజుల సంజాయిషి నోటీస్‌లు ఇస్తున్నారని అంధులకు మాత్రం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవారిని ఒక లాగా.. ధనవంతులను మరోలా చూస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. నోటీస్ ఇవ్వకుండా.. ఇళ్లు కూల్చమని చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణ సాధించుకున్నది.. బలహీన వర్గాలపై దాడుల కోసమా? అని ప్రశ్నించారు.

# రైతుల కోసం బీఆర్ఎస్ పోరాటం



## గేరు మారుస్తున్న 'కారు' సారు! - ప్రజలతో మమేకమయ్యేలా స్కెచ్!!

హైదరాబాద్ : అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూసిన బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహ రచన చేస్తున్నది. ఇందు కోసం అంశాల వారీగా పోరాటాలకు సిద్ధమవుతున్నది. ఓ వైపు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే కొన్ని అంశాలపై లీగల్‌గా ఫైట్ చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే రైతురుణమాఫీపై ప్రభుత్వంపై ఎటాక్ చేస్తున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు చేసే వ్యాఖ్యలను ప్రజలకు వివరించడంతో పాటు ధర్నాలకూ పిలుపునిచ్చింది. రైతుభరోసా, రైతు బీమా అంశాలపైనా ఫైటింగ్‌కు సిద్ధమవుతున్నది.

వానాకాలం నాట్లు పూర్తయినా రైతుభరోసా ఇవ్వలేదని, ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీయాలని భావిస్తున్నది. విద్యా, వైద్యం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేసి తమవైపు తిప్పుకోవాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఇలా పార్టీ ఇచ్చిన ప్రతి నిరసనలోనూ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. దీని కోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటించనున్నట్లు నేతలు చెబుతున్నారు.

**లీగల్ ఫైట్‌కు సన్నద్ధం...** కర్ణాటకలో జరిగిన వాల్మీకి స్కాంతో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని, 9 కంపెనీల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని, ఎన్నికల సమయంలో మద్యం, కార్లు, బంగారం కొనుగోలుకు ఉపయోగించారనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధం అవుతున్నది.

ఈ స్కాంపై ఈడీ విచారణ చేసేలా ఫిర్యాదు చేయాలని రెడీ అవుతున్నది. దీంతో పాటు సివిల్ సప్లయిలో స్కాం జరిగిందని దానిపైనా ఈడీ, సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. హైడ్రా, జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని లీగల్‌గా ఫైట్ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు టాక్ వినిపిస్తున్నది. వీటితో పాటు పార్టీపైనా, కేసీఆర్ పైనా, నేతలపైనా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపైనా ఫిర్యాదు చేయాలని భావిస్తున్నది.

**ఎల్‌ఆర్‌ఎస్ అంశాన్ని బలంగా తీసుకెళ్లాలని..** ఎల్‌ఆర్‌ఎస్ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఎన్నికల టైంలో తాము అధికారంలోకి వస్తే రూపాయి తీసుకోకుండా ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను ప్రజలకు వివరించేందుకు ఆ పార్టీ సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది. ఇప్పటికే 25.44 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయని, అందరికీ ఫ్రీగా చేయాలని డిమాండ్ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేసేలా పోరాటాలు చేయాలని నిర్ణయించనున్నట్టు సమాచారం. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైకోర్టులో వేసిన పిల్‌ను వివరించి కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టాలని గులాబీ పార్టీ భావిస్తున్నది. జాబ్ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ. 2,500 తదితర అంశాలతో ప్రజల్లోకి వెళ్లడంతో పాటు కేడర్‌లోనూ జోష్ నింపేలా బీఆర్ఎస్ వ్యూహ రచన చేస్తున్నది. మరి బీఆర్ఎస్ చేపట్టే పోరాటానికి ప్రజల మద్దతు ఎలా ఉంటుందనేది చూడాల్సి ఉన్నది.

# సంపాదకీయం

## జగన్ కి బాగా అర్ధమవుతోందా ?

జగన్ కి రాజకీయం కొత్త కాదు. ఆయన ఇంట్లోనే రాజకీయం ఉంది. పైగా ఆయన గత పదిహే నేళ్ళుగా రాజకీయాల్లో ఉన్నారు. అయినా సరే ఏదో కొత్తగా రాజకీయాలు చేయాలని జగన్ ఎందుకు అనుకుంటున్నారో అర్థం కాదు, రాజకీయాల్లో ఎపుడూ అవకాశవాదానిదే పెద్ద పీట. ఆ విషయం మరచి తాను పదవి ఇస్తే నమ్ముకుని ఉంటారు అనుకుంటే పొరపాటే అని జగన్ కి ఎన్నో సార్లు ఎన్నో సంఘటనలు చెబుతున్నా ఇంకా తత్వం అర్థం కాలేదా అన్నది చర్చగా ఉంది. జగన్ తన రెక్కల కష్టంతో 2014లో 67 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుంటే వారిలో 23 మందిని అప్పటికి టీడీపీ లాగేసింది. జగన్ మాత్రం అధికారంలోకి వచ్చాక తాను అలాంటి పనులు చేయను అని ఒట్టు పెట్టారు. సరే టీడీపీ నుంచి ఒక నలుగురు జనసేన నుంచి ఒకరు ఎమ్మెల్యే వచ్చి అనుబంధంగా కూర్చుకున్నారు. అప్పటికి సంతోషం ఏమిటి అంటే వారికి జగన్ ఏనాడూ కండువాలు కప్పలేదు. ఇక జగన్ టీడీపీ ఎమ్మెల్సీలను ఎవరినీ ఆకర్షించాలని ప్రయత్నం చేయలేదు. కానీ మూడేళ్ల తరువాత మండలిలో వైసీపీ బలం పెరిగింది. ఇపుడు మెజారిటీ ఉంది. ఒక విధంగా చూస్తే వైసీపీకి ఇదే పెద్ద దిక్కుగా ఉంది. అలాగే రాజ్యసభలో పదకొండు మంది ఎంపీలు ఉన్నారు. వీరిని చూసుకుని జగన్ బలం గా ఉన్నారని అనుకోవచ్చు. కానీ సరిగ్గా ఇక్కడే అవసరం అవకాశం కలసి రాజకీయం చేస్తాయని జగన్ ఎందుకు ఊహించుకోలేక పోయారో అర్థం కాదు. రాజకీయాల్లో అవసరాలతో అవకాశాలు ఏర్పడతాయి వాటిని వాడుకున్న వారే రాజకీయం నేర్చిన వారు. అంతే తప్ప మడి కట్టుకుని కూర్చున వారు కారు. ఇది నయా నీతి ఏ మాత్రం కాదు, ఇప్పటికి మూడు వేల సంవత్స రాల క్రితం చాణక్యుడే చెప్పిన రాజనీతి. రాజకీయం ఇలాగే ఉంటుంది. ఇది ఒక ఆట. అవతల వారు ఇదే నియమంతో ఆడుతున్నపుడు ఇవతల వారు కూడా అలాగే రాజకీయం ఆట ఆడాలి. లేదు మేము వేరే పద్ధతిలో ఆడతామని అంటే తల బొప్పి కడుతుంది. ఏపీలో జరుగుతున్నది ఇదే. జగన్ అధికారంలోకి వచ్చాక సొంత సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యం చేశారు అన్న విమర్శలు ఉన్నాయి. అదే విధంగా సామాజిక సమీకరణలు అని కొత్త ప్రయోగాలు చేశారు. విధేయతకు పెద్ద పీట అని కొందరిని అందలాలు ఇచ్చారు. మరికొందరికి కాంబినేషన్ బాగుంటుందని అనుకుని చాన్స్ ఇచ్చారు. ఇపుడు వారే జగన్ కి పార్టీకి వెన్నుపోటు పొడిచి పోతున్నారు. జగన్ వారికి ఏమీ తక్కువ చేయలేదు, ఆ సంగతి వారికి కూడా తెలుసు. కానీ ఇపుడు జగన్ వారికి ఏమీ చేయలేరు. పార్టీ ఘోరంగా ఓడింది. అందుకే వారు వేరే అవకాశాలు చూసుకుంటున్నారు. ఇందులో వారిని తప్పు పట్టాల్సిన అవసరం అయితే లేదు. ఎందుకంటే ఇదే రాజకీయం కాబట్టి. ఎవరికి పదవులు ఇచ్చినా ఇలాగే పోతారు. అలాగని ఎవరికీ పదవులు ఇవ్వకూడదని కాదు, ఇచ్చేటపుడు అన్నీ చూసుకోవాల్సి ఉంది. అంతే కాదు నేను ఇచ్చాను వారు ఆనందంగా ఉన్నారు అని జగన్ అనుకోవచ్చు. కానీ అప్పట్లో జగన్ సీఎం గా ఉండడం వల్ల వారు నోరు మెదపకపోయినా వారు కోరుకున్న పదవి దక్కలేదు అన్నది ఇపుడు బయటపెడుతున్నారు. అదే సాకుగా చూపించి వారు పార్టీ గోడ దాటుతున్నారు. నిజానికి జగన్ 2014 ఎన్నికల్లో ఓడిన ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ కి ఎమ్మెల్సీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాటు ఉప ముఖ్యమం త్రిగా చాన్స్ ఇచ్చారు. కానీ ఆయనకు ఇంకా కోరికలు ఉన్నాయి. రాజకీయాల్లో అలాగే ఉంటాయి. వాటిని అధినేత అర్థం చేసుకోవాలి. బుజ్జగించే ప్రయత్నం అయినా చేయాలి. కానీ నేను ఇచ్చేశాను కదా అని ఊరుకుంటే అలాగే ఆళ్ళ లాగ బయటకు వెళ్తారు. మోపిదేవి వెంకట రమణ వైఎస్సార్ హయాం నుంచి వైసీపీలో ఉన్నారు. ఆయన కూడా పార్టీ మారిపోయా రు. కారణం ఏమిటి అంటే ఆయనకు కూడా వేరే కో రికలు ఉన్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో ఉండాలని ఆయ న భావించి ఉండొచ్చు. ఏది ఏమైనా ఇపుడు వైసీపీలో చాలా మంది పెద్దలు తమకు ఇచ్చిన పెద్ద అవకాశాల ను వాడుకుని జంప్ అవుతున్నారు. మరి ఇదే జగన్ అర్థం చేసుకోవాలి. నేను అధినేతను వరాలు ఇస్తున్నాను అని పదవులు అధికారంలో ఉన్నపుడు పంచడం కాదు అపాత్రదానం చేస్తున్నామా అని చూసుకోవాలి. ఒకటికి పది సార్లు అన్నీ ఆలోచించి ఎంపిక చేయాల్సి ఉంటుం ది. ఇక సొంత ఊరు కన్న తల్లి అని అంటారు. అలా సొంత సామాజిక వర్గాన్ని కూడా అందలం ఎక్కించడం ఈ రోజులలో తప్పు కాదు, ఆ పని చేయకపోవడం వల్ల జగన్ రెండింటికీ చెడ్డారా అన్న చర్చ సాగుతోంది.

# వినాయక నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : వినాయక నిమజ్జనానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అధికారులను ఆదేశించారు శుక్రవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పై నిర్వహించిన సమన్వ సమావేశంలో అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా,రాచకొండ డిసిపి కరుణాకర్, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ లతో కలిసి జిల్లా కలెక్టరు గౌతం పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 17 చెరువులు ఉన్నాయని, వాటిలో వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లును పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవటంతో పాటు నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్ సైతం సిద్ధం చేసుకొని అందుకు అవసరమైన రూట్లలో రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాల్సిందిగా ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణా శాఖ అధికారులు సర్టిఫై చేయాలని ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఉండేలా ఏర్పాట్లు చూడాలని పోలిస్ శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. వినాయక నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఇద్దరు మెడికల్ అఫీసర్లు, కింది స్థాయి సిబ్బందితో మెడికల్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు షిఫ్టుల వారిగా విధులు నిర్వహించేలా, అదే విధంగా అంబులెన్సును అందుబాటులో ఉండేలా, అత్యవసర సమయాలలో బయటకు వెళ్లే దారి క్లియర్ గా ఉండేలా చూడాలని కలెక్టరు మెడికల్ అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎమర్జెన్సి సందర్భంలో దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలని జిల్లా మత్స్య శాఖ అధికారికి కలెక్టర్ సూచించారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని నిమజ్జనానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్తు శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రతి నిమజ్జన స్థలం వద్ద అదనపు ట్రాన్స్ఫార్మర్లు, పవర్ జేనరేటర్లను ముందు జాగ్రత్తగా అందుబాటులో ఉంచడంతో పాటు వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైన చర్యలను తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎలక్ట్రిక్ డిపార్ట్ మెంట్ వారు అవసరమైన మేరకు నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తూ, ప్రతి చెరువు దగ్గర లైన్ మెన్ ను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రాఫిక్ అధికారులకు కలెక్టరు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి వారు చెరువుల వద్ద పొల్యూషన్ లెవెల్స్ చెక్ చేస్తూ ఉండాలన్నారు. గణేష్ నవరాత్రులు మొదలు కొని నిమజ్జనం పూర్తయే వరకు అగ్ని మాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మండపాలలో అనుకొకుండా అగ్నిప్రమాదం జరిగితే ఏవిధమైన నివారణ చర్యలు తీసుకోవాలనే అంశం పై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అగ్నిమాపక అధికారులకు ఆదేశించారు. ప్రతి నిమజ్జన చెరువులకు ఒక నోడల్ ఆఫీసర్ తో పాటు సంబంధిత శాఖల సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడం తోపాటు అదనంగా కొన్ని క్రేన్లను సన్నద్ధం చేయాలన్నారు. శామీర్ పేట చెరువు దగ్గర అవసరమైన మొబైలు టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీసు, ట్రాఫిక్, మత్స్య, వైద్య, అగ్నిమాపక, అర్ అండ్ బి, పొల్యూషన్, విద్యుత్తు, జలమండలి శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, తహశీల్దార్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసరాలు ధరలు పైపైకి




పెద్దపల్లి : రోజురోజుకూ నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డీజిల్, పెట్రోల్, బియ్యం, పప్పులు, కూరగాయల ధరలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. మరోవైపు నిత్యావసర వస్తువుగా మారిన ఫోన్ రీఛార్జ్‌కు సంబంధించి అన్ని ప్రముఖ టెలికాం సంస్థలు సైతం అమాంతం ధరలు పెంచడమే కాకుండా గతంలో 28 రోజులకు టారిఫ్ ఉంటే ప్రస్తుతం 20 రోజులకే పరిమితం చేశాయి. ఇవన్నీ పేద, మధ్య తరగతి వర్గాల వారి ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ పరంగా చౌకధరల దుకాణాల ద్వారా నిత్యం అవసరమయ్యే ఈ సరకులను రాయితీ ధరలకు విక్రయించి దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ప్రజలను ఆదుకోవాల్సి ఉన్నప్పటికి కేవలం దొడ్డు బియ్యం ఉచితంగా ఇచ్చి చేతులు దులుపుకొంటోంది. చక్కెర, గోధుమలు వంటివి అంత్యోదయ అన్నపూర్ణ కార్డులున్నవారికి మాత్రమే అప్పుడప్పుడూ పంపిణీ చేస్తున్నారు. పీఎంసీ (ప్రైస్ మానిటరింగ్ కమిటీ) దాదాపుగా రెండేళ్లుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమావేశాలు నిర్వహించడం లేదు. పెరిగిపోతున్న ధరలు నియంత్రించేందుకు ఏ కమిటీ సక్రమంగా పనిచేయడం లేదు.ధరల పర్యవేక్షణ కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల అధికారి వ్యవహరిస్తారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల శాఖ సంస్థ డీఎం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు నిత్యావసర సరకులతో సంబంధం ఉన్న అధికారులు సభ్యులుగా ఉంటారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ కమిటీ ప్రతినెలా సమావేశం నిర్వహించి ధరలు, విక్రయాలపై చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి సరకులు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటే ప్రభుత్వ పరంగా కేంద్రం ఏర్పాటు చేయించి ప్రజలకు సరకులు విక్రయించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

హెూల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు సిండికేట్ అవుతుండటంతో ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రిటైల్ వ్యాపారుల వద్ద సిండికేట్ లేకపోవడం, ఒకరు తక్కువ ధరల్లో, మరొకరు ఎక్కువ ధరల్లో విక్రయిస్తుండటంతో అక్కడక్కడా ధరల పెరుగుదలలో వ్యత్యాసం కనిపిస్తోంది. బియ్యం, నూనె, ఉల్లిగడ్డ, పప్పులను వ్యాపారులు గోదాముల్లో నిల్వ చేసి ధరలు పెరుగుతుండే క్రమంలో ఎక్కువ ధరలతో విక్రయిస్తుంటారు.

బియ్యం నాణ్యతను బట్టి వ్యాపారులు ధర అమాంతం పెంచేస్తున్నారు. ఈ ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి.

**భారత్ బియ్యం బస్తా కనిపించడం లేదు**

సన్నబియ్యం మార్కెట్‌లో కిలో రూ.65 వరకు ఉంటోంది. కేంద్రం కిలో రూ.29కే భారత్ రైస్ పేరుతో పదికిలోల బస్తాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడా కనిపించడం లేదు. అప్పుల్లో బతకాల్సి వస్తుంది. ధరల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మహేందర్, చిరుద్యోగి, శాంతినగర్

**రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలి**

నెలకు రూ.5 వేల వరకు ఖర్చు చేస్తే తప్ప నెలవారీ సామగ్రి వచ్చేలా కనిపించడం లేదు. కూరగాయలకు వారానికి రూ.500 వరకు వెచ్చించాల్సి వస్తుంది. గతంలో 9 రకాల వస్తువులను రేషన్ దుకాణాల్లో రాయితీ ధరలకు ఇచ్చేవారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.– రజిత, గృహిణి, పెద్దపల్లి

# మీనం.. సకాలంలో చేరేనా?

సిరిసిల్ల: మత్స్యకారుల జీవనోపాధికి ఎప్పటిమాదిరిగానే వంద శాతం రాయితీపై చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేది. జులై నుంచి సెప్టెంబరు వరకు జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని బట్టి చేప పిల్లలు వదులుతారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం కొనసాగింపుపై స్పష్టత రాలేదు. దీంతో మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొంది. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఇటీవల ప్రభుత్వానికి చేప పిల్లల సరఫరాకు టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 23తో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. జలాశయాలు, చెరువుల్లో నీటి లభ్యతను బట్టి పంపిణీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 772 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. వాటిలో 53,859 మంది సభ్యులున్నారు. 2023–24 సంవత్సరంలో 6.08 కోట్ల చేప పిల్లల పంపిణీ జరిగింది. ఉమ్మడి జిల్లాలో చేప పిల్లలను సరఫరా చేసే గుత్తేదారులు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుత్తేదారులు ఏటా టెండర్లలో అవకాశం దక్కించుకుంటున్నారు. అయితే వీటిని ఆయా సంఘాలకు పంపిణీ చేయడంలో వ్యత్యాసం ఉంటుంది. దీనిపై గతంలో చాలా సార్లు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. నిర్దేశించిన లక్ష్యానికి సరిపడా లేక తక్కువ సంఖ్యలో ఇస్తుండటంతో మత్స్యకారులు ఆందోళనకు దిగిన సంఘటనలూ ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎకో హేచరీ ద్వారా ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నప్పటికీ యంత్రాంగం గుత్తేదారులపైనే ఆధారపడుతోంది. వీరు జులై చివరి వారం నుంచి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ప్రస్తుతం జలాశయాలు, చెరువుల్లో నీటి సామర్థ్యం అంతంత మాత్రంగానే ఉండటంతో పంపిణీ మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. ఈసారైనా అధికారులు పక్కాగా చర్యలు చేపట్టి నాణ్యమైన విత్తనం పంపిణీ చేయాలి.

**ప్రభుత్వ ఉత్పత్తి నామమాత్రమే**

దిగువ, ఎగువ మానేరు జలాశయాల సమీపంలో జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నాయి. ఇక్కడ ఎకో హేచరీలో చేప పిల్లలను పెంచుతున్నారు. దిగువ మానేరు జలాశయం సమీపంలోని ఉత్పత్తి కేంద్రంలో 8 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంది. దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వమే సొంతంగా పంపిణీ చేసే వీలుంది. ఎగువ మానేరులో 30 లక్షల పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఏటా ఇక్కడ ఉత్పత్తి చేసినవి, టెండర్ల ప్రక్రియలో తక్కువ కేటాయింపులు జరిగిన చోటకు పంపిస్తున్నారు. మరోవైపు ఈ కేంద్రాల్లో సరైన వసతులు, సిబ్బంది నియామకం, ప్రభుత్వం నుంచి అరకొర నిధుల కేటాయింపుతో నిర్వహణ లేదు.

**నీటి లభ్యత అంతంత మాత్రమే**

ఉమ్మడి జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు, ఎగువమానేరు, అన్నపూర్ణ జలాశయాలతోపాటు 3,235 చెరువులు ఉన్నాయి. జలాశయాల్లో ప్రస్తుతం నీటి లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చాలా చెరువులు బోసిపోయి ఉన్నాయి. ఈ నెలలో సాధారణ వర్షాలు పడితే జలకళ సంతరించుకుంటుంది. సగానికి పైగా నీరుంటేనే పంపిణీకి అవకాశం ఉంటుంది. ఏడేళ్లుగా జరుగుతున్న పంపిణీ ప్రక్రియ సెప్టెంబరు నెలాఖరు వరకు కొనసాగుతోంది.

**పారదర్శకంగా పంపిణీ**

టెండర్ల ప్రక్రియ పూర్తయినా జలాశయాలు, చెరువుల్లో సగానికి పైగా నీరు చేరిన తర్వాతే పంపిణీ జరుగుతుంది. ఇప్పటికే లక్ష్యాలను నిర్దేశించాం. ప్రభుత్వ నిబంధన ప్రకారం మత్స్య సహకార సంఘాల పర్యవేక్షణలోనే పిల్లలను వదులుతాం. పారదర్శకంగా పంపిణీ చేస్తాం. లోటు పాట్లు ఉంటే లబ్ధిదారులు మా దృష్టికి తీసుకురావాలి. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, రాజన్న సిరిసిల్ల

ఉమ్మడి జిల్లాలో జలాశయాలు: 4
చేప పిల్లలు వదిలే చెరువులు: 3,235
మత్స్య సహకార సంఘాలు: 772 సంఘాల్లో సభ్యులు: 53, 859 2023–24లో పంపిణీ చేసిన చేప పిల్లలు: 6.08 కోట్లు

# అమ్ముడు పోవు.. జీవనం సాగదు

చౌటుప్పల్ : చేనేత కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుని ఇంటిల్లిపాదీ శ్రమించి మగ్గాలపై నేసిన కళాత్మక వస్త్రాలివి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో యాభైకి పైగా చేనేత పారిశ్రామిక సహకార సంఘాలు నేతన్నలకు నూలు, రంగులు, రసాయనాలు సరఫరా చేసి మగ్గాలపై వస్త్రాలు తయారు చేయిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సుమారు రూ.పది కోట్ల విలువైన చేనేత వస్త్రాలు సహకార సంఘాల్లో నిల్వ ఉన్నాయి. ఒక్క చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలోని రూ.1.30కోట్ల విలువైన వస్త్రాలు నిల్వ ఉన్నాయి. వీటిని నేసినందుకు కూలి డబ్బు ఇవ్వాలని అడిగితే మీరు నేసిన వస్త్రాలు 'టెస్కో' కొనుగోలు చేయకపోవడంతో ఇక్కడే నిల్వ ఉన్నాయని సహకార సంఘాల్లోని సిబ్బంది సమాధానమిస్తున్నారని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వస్త్రాలు నేసినందుకు కూలి డబ్బు కోసం కార్మికులు తొమ్మిది నెలలుగా ఎదురు చూస్తున్నారు. 'టెస్కో' తనకు అవసరమైన వస్త్రాల ఉత్పత్తి కోసం చేనేత సహకార సంఘాలకు పని కేటాయించింది. ఆ ప్రకారం సహకార సంఘాలు వారి సభ్యులతో మగ్గాలపై వస్త్రాలను తయారు చేయించారు. వాటిని టెస్కో డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉండగా గత సంవత్సరం సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు ఇటు వైపే రాలేదు. నేసిన వస్త్రాలే అమ్ముడు పోలేదని తమకు సహకార సంఘాలు పని కల్పించడం లేదని, తామెలా బతకాలని చేనేత కార్మికులు ఆవేదన చెందుతున్నారు. నిల్వ ఉన్న వస్త్రాలన్నీ నగదు చెల్లించి టెస్కో ద్వారా కొనుగోలు చేయించాలని చేనేత మంత్రి, కమిషనర్‌లకు సహకార సంఘాల పర్సన్ ఇన్‌ఛార్జీలము విన్నవించుకున్నామని కొయ్యలగూడెం చేనేత సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి గడ్డం జయశంకర్‌కు తెలిపారు.

# రైతు రుణ సమస్యకు భరోసా

వికారాబాద్ : రుణమాఫీకి అన్ని అర్హతలు ఉన్నా పలు కారణాల వల్ల మాఫీ కాక రైతులు అధికారుల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇలాంటి రైతుల కోసం 'రైతు భరోసా' 'రుణమాఫీ' యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా రైతన్నలకు ఊరట కలుగుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. సంబంధించికథనం

ఇప్పటివరకు 6,000 దరఖాస్తులు

ప్రభుత్వం వివిధ దశల్లో రూ.2 లక్షల వరకు మాఫీ చేసింది. కొంతమందికి ఇప్పటి వరకు మాఫీ కాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. వీరు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇలా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి దాదాపు 6,000 దరఖాస్తులు వచ్చాయి. వీరు కలెక్టరేట్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ సమస్యల పరిష్కరించాలని తిరుగుతున్నారు.

అధికారులకు శిక్షణ ఇచ్చారు



మాఫీ వర్తించని వారి ఇళ్లకు అధికారులు వెళ్లి క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకుని యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఉన్నతాధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. రుణమాఫీ యాప్‌పై అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. యాప్‌లో మండల వ్యవసాయాధికారులు మాత్రమే లాగిన్ చేయాల్సి ఉంటుంది. పంట రుణం ఆప్షన్‌లోకి వెళ్లి దరఖాస్తుదారు తీసుకున్న బ్యాంక్ పేరు, బ్రాంచి వివరాలు పొందుపర్చగానే సదరు బ్యాంకులో ఉన్న రైతుల వివరాలు వస్తాయి. దరఖాస్తుదారు ఆధార్ సంఖ్యను నమోదు చేయాలి. అనంతరం కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయాలి. చివరకు వ్యవసాయాధికారి కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం దరఖాస్తుదారు నుంచి ధ్రువీకరణ పత్రం (పంచాయతీ కార్యదర్శి లేదా ప్రభుత్వ ఉద్యోగి ద్వారా పొందిన) తీసుకుంటారు. కుటుంబ సభ్యుల నిర్ధరణ కోసం

రుణమాఫీ కాని రైతుల కోసం ఏర్పాటు చేసిన యాప్‌ను ప్రస్తుతానికి కుటుంబ సభ్యుల నిర్ధరణ కోసమే వినియోగించనున్నాం. రుణ మాఫీ కాలేదని చెబుతున్న రైతుల నుంచి మండల స్థాయిలో దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. రైతులకు అన్ని విధాలా న్యాయం చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఎన్.మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

# కష్టాల కడలిలో నేతన్న

దుబ్బాక: ప్రతి ఒక్కరికి కూడు, గూడు, వస్త్రం ఎంతో అవసరం. దేశంలో వ్యవసాయం తర్వాత చేనేతకు అత్యంత ప్రాధాన్యం ఉండేది. కానీ ఇప్పుడది మారింది. మరమగ్గాల రాకతో చేనేత రంగం కుదేలవుతోంది. చేనేతకు ప్రసిద్ధి చెందిన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఇప్పటికీ కొందరు ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు. ఒకప్పుడు కళకళలాడగా, ఈ రంగంలోని ఎంతోమంది ఉపాధి కరవై వలస వెళ్లడంతో కళావిహీనమైంది.


దుబ్బాకలో 1947లో చేనేత సహకార సొసైటీ 200 మంది సభ్యులతో ఏర్పడింది. ప్రస్తుతం 1734 మంది కొనసాగుతున్నారు. సభ్యుల సంఖ్య పెరిగినా నేత పని చేస్తున్న వారు మాత్రం స్వల్పమే. గతంలో 700 మందికి పైగా చేనేత కార్మికులు వస్త్రాలు నేయగా, ఇప్పుడు 100లోపే ఉండటం గమనార్హం. 2020లో సంఘం పాలకవర్గంపై పలు ఆరోపణలు రాగా, ప్రభుత్వం విచారించి రద్దు చేసింది. ఆ తర్వాత ఒక ప్రభుత్వ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు.


అరకొర వేతనాలతో..

ప్రస్తుతం 40 మగ్గాలపై 50 మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో పలు ఆకృతుల్లో చేనేత దుస్తులు తయారుచేస్తున్నారు. నేషనల్ హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ నుంచి ప్రతి మూడు నెలలకోసారి 2 నుంచి 3 క్వింటాళ్ల నూలు కొనుగోలు చేస్తున్నారు. జరీ చీరలు, షర్టులు, తువాళ్లు, లెనిన్ కాటన్ చీరలు, దుప్పట్లు తయారు చేస్తున్నారు. వాటిని రాష్ట్ర చేనేత సహకార సంఘం(టెస్కో)కు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇటీవల జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మెడలో వేసిన నూలు లడీల దండను ఇక్కడి వారే రూపొందించారు. నాలుగు నెలల క్రితం రాష్ట్ర దేవాదాయ, న్యాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి కొండా సురేఖ దుబ్బాక చేనేత సహకార సంఘాన్ని సందర్శించి, కార్మికులు నేసిన చేనేత జరీ చీరను రూ.15 వేలకు కొనుగోలు చేశారు. ఇక్కడి ఉత్పత్తులకు వివిధ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది.

ఇలా చేస్తే ప్రయోజనంప్రభుత్వం తోడ్పాటు అందిస్తే, విభిన్న ఆకృతుల్లో వస్త్రాల తయారు చేసేందుకు ఇక్కడి కార్మికులు సిద్ధం. ఒకరు నెల పాటు శ్రమిస్తే రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు సంపాదిస్తున్నారు. అరకొర వేతనాలతో సతమతమవుతున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం రాయితీపై రుణాలు మంజూరు చేయాలి. బీమా సౌకర్యానికి ఉన్న 59 ఏళ్ల వయోపరిమితిని ఎత్తివేయాలి. నూలుపై రాయితీ ఇవ్వడంతో పాటు అంత్యోదయ, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కార్మికులు విన్నవిస్తున్నారు. పింఛన్ సౌకర్యం కూడా కల్పించాలని కోరుతున్నారు.

# జైలా.. పచ్చిక బయలా!





సంగారెడ్డి : అదో కారాగారం.. అక్కడ అడుగు పెట్టగానే పచ్చందాలు స్వాగతం పలుకుతాయి. వివిధ రంగుల్లోని పూల మొక్కలు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. ఇవన్నీ సంగారెడ్డిలోని కేంద్ర కారాగారం విశేషాలు. 2012లో అప్పటి ఖైదీలు మొక్కలు నాటి సంరక్షించడంతో అవి ఏపుగా పెరిగి పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. ఖైదీల్లో నేర ప్రవృత్తి తగ్గించేలా.. సత్ప్రవర్తనకు ప్రభుత్వం జైళ్ల శాఖలో పలు సంస్కరణలు తీసుకురాగా, ఇందులో భాగంగా మొక్కల పెంపకంపై దృష్టిసారించింది. జైలు ప్రాంగణం 40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, 13 ఎకరాల్లో పలు భవనాలు నిర్మించారు. మిగతా దాంట్లో మామిడి, అల్ల నేరేడు, జామ తోటలు, టేకు వనం పెంచుతున్నారు. కూరగాయ లనూ పండిస్తున్నారు. నిత్యం 20 మంది ఖైదీలు, ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షిస్తుంటారని జైలు పర్యవేక్షకుడు భరత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 590 మంది ఖైదీలున్నారు.

# రక్షణ లేక చెరువుల భక్షణ



కరీంనగర్ : ఇదీ.. కరీంనగర్–చొప్పదండి రోడ్డు పక్కనే ఆరెపల్లి శివారులోని ఊరకుంట. గతంలో అధికారులు గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా గుర్తించిన ఎఫ్‌టీఎల్ పరిధి ఇది. 8.2 ఎకరాలున్న ఈ నీటి వనరు కాలక్రమంగా కుంచించుకుపోయింది. అక్రమ నిర్మాణాలతో రూపు కోల్పోతోంది. 2015లో మిషన్ కాకతీయ పనులు చేపట్టేందుకు రూ.14.56 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇక్కడి తూముకు అప్పట్లో మరమ్మతు చేశారు. స్థిరాస్తి జోరు పెరగడంతో ఇక్కడి విలువైన భూమిపై కన్నేసిన కొందరు అందినకాడికి ఆక్రమించుకునే పనిలో ఉన్నారు.

విషయం : చెరువులు, కుంటల పరిరక్షణ

ఏం జరిగింది : జిల్లాలో చాలా చోట్ల చెరువు, కుంటల శిఖం స్థలాలు కనుమరుగయ్యాయి. హద్దులు చెరిగిపోయాయి. నిర్మాణాలు వెలిశాయి.

అధికారుల పాత్ర : ఎప్పటిలాగే ఇప్పటికీ వీటి సంరక్షణ పరంగా కఠినమైన చర్యలు తీసుకోలేదు. వారి చోద్యం ఫలితంగా ఎక్కడికక్కడే ఎఫ్‌టీఎల్(నీటి నిల్వ స్థాయి) పరిధి ప్రదేశాలు ఆక్రమణలకు గురయ్యాయి. కోట్లాది రూపాయల విలువైన జాగలు ఇతరుల పరమయ్యాయి.

తక్షణ కర్తవ్యం : ప్రస్తుతం హైదరాబాద్‌లో జలవనరుల చుట్టూ ఆక్రమణలపై ఉక్కుపాదాన్ని మోపుతున్న హైడ్రా తరహాలోనే మనకూ కుడ్రా (కరీంనగర్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) ఏర్పాటవ్వాలి. ఏళ్లతరబడి ఆక్రమణల చెరలో ఉన్న భూములకు విముక్తి కలగాలి.

ఇలా ఇష్టారాజ్యమే..

జిల్లా వ్యాప్తంగా చెరువులు కుంటలన్నీ కలిపి 1008 ఉన్నాయి. వీటన్నింటి విస్తీర్ణం 13,456 హెక్టార్లుగా రికార్డుల్లో ఉండగా.. దాదాపు సగానికిపైగా స్థలాల్లో నిర్మాణాలు జరిగాయి. ఫంక్షన్‌హాళ్లతోపాటు ఇతరత్రా భవనాలు కొన్ని వెలిశాయి. కరీంనగర్, కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రెండు దశాబ్దాల కిందట ఉన్న చిన్న కుంటలు మాయమయ్యాయి. కనీసం కంటి చూపునకు కూడా అక్కడ నీటి ఆనవాళ్లు లేవు. లోతట్టు ప్రాంతాలను పూడ్చి భవనాలు నిర్మించారు. కొన్ని చోట్ల రికార్డుల్లోనూ భూమార్పిడి జరిగింది.

బొమ్మకల్ సమీపంలో భూమాఫియా ఆగడాలకు చాలా చెరువులు ధ్వంసమయ్యాయి. 46.21 ఎకరాల జక్కప్ప చెరువు, 28.10 ఎకరాల గోపాల్‌చెరువు, 16.10 ఎకరాల నల్లచెరువు, 12 ఎకరాల గోదుమకుంట, 9.10 ఎకరాల రావికుంట విస్తీర్ణంలో 70 శాతం భూభాగం పరుల ఆధీనమైంది.

ఫిర్యాదులపై చర్యల్లేవు..

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి కచ్చితంగా రెండు మూడు గ్రామాలకు చెందిన చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతాయి. గ్రామస్థులు కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించినా.. క్షేత్రస్థాయిలో వాస్తవాలను మాత్రం నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించడంలేదు. చెరువుల పరిరక్షణకు జిల్లా కలెక్టరు అధ్యక్షతన ఉన్న కమిటీ కొన్నేళ్లుగా సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏటా ఒకసారి చిన్ననీటి వనరుల సరిహద్దులను సంబంధిత అధికారులు గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి. ఎక్కడైనా ఆక్రమణలుంటే పోలీసుల సహకారంతో కూల్చివేయాలి. కానీ రాజకీయ ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాలతో అధికారులు మిన్నకుంటున్నారు. ఎవరు ఏమన్నారనే ధైర్యంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు.

పూడ్చేస్తున్నారిలా..ఇలా నిన్నటికి నిన్న తీగలగుట్టపల్లి శివారులోని బతుకమ్మకుంటను దర్జాగా కబ్జా చేస్తున్నారు. పక్కనే ఉన్న పెద్ద బండరాళ్లను ఇందులో నింపుతూ ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు దాదాపు 5 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న ఈ కుంట ఇప్పుడు ఎకరంలోపు ఉన్న స్థలం మాదిరి చిన్నగా మారిపోయింది. కట్టతోపాటు ఎఫ్‌టీఎల్ పరిధి నలువైపులా కబ్జా కోరల్లో చిక్కుకుపోయింది. నగర పరిధిలోని మాలకుంట, ఉడుతకుంట, అవుసులకుంటలకు కబ్జాగండం తప్పలేదు. వీటిపై చాలాసార్లు స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. సంరక్షణ దిశగా మాత్రం చర్యలు కనిపించలేదు.

# హత్తుకొంటూ.. బతుకునిస్తూ..



కరీంనగర్ ః ఆగస్టు 12న ప్రభుత్వ ఆసుపత్రిలో పండంటి బాబుకు జన్మనిచ్చిన తల్లికి మనసెలా ఒప్పిందో కానీ తనకు ఆ బాబు వద్దంటూ శిశుగృహకు అప్పగించింది. ఆ బాబు ఆలనాపాలనా వారే చూసుకుంటున్నారు. కొన్ని నెలల కిందట మరో పాపను కూడా శిశుగృహలో వదిలేసి వెళ్లగా ఆమెను నిర్వాహకులు పోషిస్తుండగా 13 నెలల పాప చిరునవ్వులు చిందిస్తోంది.

ఇలా వివిధ కారణాలతో అనాథగా మారిన అభం శుభం తెలియని చిన్నారులను, పసికందులను శిశుగృహ అక్కున చేర్చుకుంటుంది. తల్లిదండ్రులను కోల్పోయి.. తాత, నాన్నమ్మ, అమ్మమ్మ సంరక్షణలో పెరుగుతున్న క్రమంలో వారిద్దరూ దూరమై పట్టించుకునే వారు కరవైన వారికి బాలసదనం ఆశ్రయం కల్పిస్తోంది. వారి చదివించి ప్రయోజకులుగా చేసే బాధ్యత తీసుకుంటుంది. వృద్ధాప్యంలో కొడుకులు, కోడళు వెలివేస్తే దిక్కుతోచని పరిస్థితిలో కొందరు ఆశ్రమాల్లో చేరుతున్నారు. ఉమ్మడి జిల్లావాసులకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆశ్రయం కల్పిస్తున్న ప్రభుత్వ సంస్థలపై కథనం.

బాగా చదువుతున్న బాలసదనం పిల్లలు

కరీంనగర్ బాలసదనంలో పెరుగుతున్న అనాథ పిల్లలు బీటెక్, ఏఎన్‌ఎం, పాలిటెక్నిక్ కోర్సుల వంటివి కూడా చదువుతూ తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లాకు చెందిన హరిణి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ పూర్తి చేస్తుండగా ఆమె చెల్లెలు పదోతరగతి చదువుతోంది.

సదనంలో మొత్తం 32 మంది ఉండగా 19 మంది అయిదో తరగతి వరకు చదువుతుండగా ఏడుగురు పదో తరగతి వరకు, అయిదుగురు పాలిటెక్నిక్ ఇతర కోర్సులు చదువుతున్నారు.

ఇక్కడి వారిలో కొందరిని దత్తత తీసుకుంటారని ముగ్గురు ఇటలీ, ఒకరు స్విట్జర్లాండ్ ఇటీవల వెళ్లారని సూపరింటెండెంట్ సంతోషిణి తెలిపారు. స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో అందరూ ఆడపిల్లలే ఉన్నారు.

ఆశ్రయానికి సంప్రదించే నంబరు : 98495 74457

వృద్ధులు, దివ్యాంగులకు ఇదే దారి..

పిల్లలు లేని వృద్ధులు, పిల్లలు ఆదరించని తల్లిదండ్రులు, అనాథలుగా ఉన్న అంధులు వంటి వారికి వృద్ధుల, దివ్యాంగుల ప్రభుత్వ వసతిగృహం ఆశ్రయం కల్పిస్తోంది. మొత్తం 60 మందికి వసతి అవకాశం ఉండగా ప్రస్తుతం 18 మంది వృద్ధులు, 13 మంది అంధులు ఉంటున్నారు. వీరితోపాటు దివ్యాంగులు 21 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఇందులో ఆశ్రయం పొందాలంటే మహిళా శిశు సంక్షేమ శాఖను ఆశ్రయించాల్సి ఉంటుంది. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ఆశ్రయం పొందాలంటే సంప్రదించాల్సిన నంబర్ : 94929 30728

ఆలనాపాలనా అందించేందుకు శిశుగృహ

కరీంనగర్‌లోని శిశుగృహలో ప్రస్తుతం ఏడుగులు పిల్లలు ఉన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వారికి ఆశ్రయం కల్పించి ఆలనాపాలనా చూసుకుంటారు. వీరిలో ఇద్దరు ఆడపిల్లలు, అయిదుగురు మగ పిల్లలు ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు మానసిక దివ్యాంగులు కూడా ఉన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలతో ఈ సంస్థ కొనసాగుతోంది. ఇక్కడ పెరిగే పిల్లల్లో కొందరిని విదేశీయులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత తీసుకెళ్లారు. అలా ముగ్గురు ఇటలీ, ఒకరు అమెరికా వెళ్లారు. ఈ పిల్లలను దత్తత తీసుకోవాలంటే స్త్రీ శిశు సంక్షేమ శాఖను ఆశ్రయించాల్సి ఉంటుందని శిశుగృహ మేనేజర్ తేజస్విని తెలిపారు.

ఎవరైనా పోషించలేని పిల్లలను వదిలి వేయకుండా తమకు సమాచారం ఇస్తే శిశుగృహకు తీసుకొస్తామని వివరించారు.

ఆశ్రయించాల్సిన ఫోన్ నంబర్ : 88851 76924 ప్రభుత్వ ఆశ్రయం పొందవచ్చుఅనాథ పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు తమ వసతిగృహాల్లో ఆశ్రయం కల్పిస్తున్నాం. పిల్లలకు చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.

– సరస్వతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, కరీంనగర్

# ప్రజా ప్రయోజన.. ఉపాధి

పరిగి : 'జాతీయ ఉపాధి హామీ పథకం' రూపు మారుతోంది. ఇప్పటివరకు దీనికింద కేవలం భూ అభివృద్ధి, గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణం, నర్సరీల నిర్వహణ తదితర పనులు మాత్రమే సాగేవి. ఈ ఆర్థిక సంవత్సరంలో వీటితో పాటు ఇతర సామాజిక అభివృద్ధి పనులు చేపట్టేందుకు 'జిల్లా గ్రామీణాభి వృద్ధి సంస్థ' ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీంతో జిల్లాలోని ఈ పథకం అమలవుతున్నా ఆయా గ్రామాలు, మండలాలు మరింత ప్రగతి పథంలో పయనించే అవకాశం లభిస్తోంది. దీనికి సంబంధించి కథనం.

స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి అమలు జిల్లాలో 4 నియోజకవర్గాలు, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. ఉపాధి కింద అనేక రకాల పనులకు అవకాశం ఉన్నప్పటికీ కొన్నేళ్లుగా కొన్నింటికే పరిమితమయ్యారు. ఈసారి అవకాశం ఉన్న వాటన్నింటినీ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి చేపట్టనున్నారు. ఇటీవలే పదవీ బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ఈ క్రమంలోనే పరిగిలో పర్యటించి డంపింగ్ యార్డును ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మొత్తం 9,169 పనులు.. కావాల్సిన నిధులు రూ.91.23

జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపొనెంట్ పనుల కింద ఇప్పటివరకు 9,169 పనులను గుర్తించగా రూ.91.23కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఉత్సాహంగా ఉన్న వారిని గుర్తించి చేపట్టేవిధంగా ప్రోత్సహించనున్నారు.

వీటిపై దృష్టి సారిస్తారు

విద్యాలయాలకు ప్రహరీల నిర్మాణం.

వాన నీటి సంరక్షణకు ప్రాధాన్యం. అంగన్‌వాడీ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనుల గుర్తింపు. ఆర్థికంగా వెనుకబడిన కులాలకు (ఎస్సీ, ఎస్టీలు) పశువుల పాకలు, జీవాలు, కోళ్లషెడ్ల నిర్మాణం. తుది దశలో క్షేత్రస్థాయి సర్వే వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నాం. అంగన్‌వాడీ పాఠశాలల్లో శౌచాలయాల నిర్మాణానికి రూ.25వేలు వెచ్చిస్తాం. పనుల కోసం క్షేత్ర స్థాయి సర్వే తుది దశకు చేరుకుంది. ఆయా రకాల పనులతో ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుంది. శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి.

# డెంగీలో.. ప్లాస్మా లీకేజీ.. జర జాగ్రత్త!

హైదరాబాద్: డెంగీ సోకితే ప్లేట్‌లెట్లు తగ్గడం కంటే.. ప్లాస్మా లీకేజీ ఎక్కువ ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ ఆసుపత్రుల్లో ఎక్కువ మంది చికిత్స పొందుతున్నారు.

ప్లాస్మా లీకేజీలు ఎలా గుర్తించాలంటే..

డెంగీ వైరస్‌తో రక్త నాళాల్లోని ఎండోథిలియం పొరలో వాపు వచ్చి మధ్యలో ఖాళీలు ఏర్పడతాయి. తద్వారా రక్తంలోని ప్లాస్మా లీకేజీ అవుతుంది. కొందరిలో డెంగీ సంక్లిష్టం కావడానికి ప్లాస్మా లీకేజీ ప్రధాన కారణం. కాళ్లు, కంటిచుట్టూ వాపు, రక్తంలో హెమటోక్రిట్ స్థాయిలు పెరగడం, పల్స్, బీపీ పడిపోవడం, కాళ్లు, చేతులు



చల్లబడటం, వాంతులు, కడుపులో తీవ్రమైన నొప్పి తదితర లక్షణాలు కన్పిస్తే.. ప్లాస్మా లీకేజీగా భావించి అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. ఆలస్యం చేయడం వల్ల హెమరేజిక్ షాక్ సిండ్రోమ్‌కు దారి తీసి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

నిర్లక్ష్యం పనికి రాదు –డాక్టర్ రాజారావు, సీనియర్ వైద్యులు

డెంగీ సోకితే భయపడాల్సిన అవసరం లేదు. నిర్లక్ష్యం కూడా పనికి రాదు. డెంగీకి ఎలాంటి మందులు లేవు. జ్వరం వస్తే పారాసిటమాల్‌పాటు ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. పది శాతం మందిలో కొంత ప్లాస్మాలీకేజీల ముప్పు ఉంటుంది. ప్లాస్మా లీకేజీ లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# బోధనకు వ్యథ

సంగారెడ్డి : పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఇబ్బందిగా మారింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ముగిసిన తర్వాత ఖాళీలు మరిన్ని పెరిగాయి. ఖాళీగా ఉన్న స్థానాల్లో గతంలో విద్యా వాలంటీర్లను(అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు) నియమించే వారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై మూడో నెల కొనసాగుతున్నప్పటికీ నియామకాలపై ఎలాంటి స్పష్టత లేదు. ఖాళీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వాలంటీర్లను నియమించుకోవాలని ఇటీవల నిర్వహించిన సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అధికారికంగా ఆదేశాలు రాకపోవడంతో వాలంటీర్లను నియమించుకునేందుకు విద్యాశాఖ అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

కలెక్టర్ చొరవ చూపితే మేలు

గత రెండు విద్యా సంవత్సరాల్లో పదో తరగతి విద్యార్థుల కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యా వాలంటీర్లను నియమించారు. ఉన్నత పాఠశాలల్లో బోధించే 299 ఉపాధ్యాయ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నత పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

మారుమూల మండలాల్లో..జిల్లాలోని 1247 పాఠశాలల్లో 1,111



ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల బదిలీలు, పదోన్నతులు నిర్వహించడంతో పట్టణ ప్రాంతాల్లో పోస్టులన్నీ దాదాపు భర్తీ అయ్యాయి. ఖాళీలన్నీ నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లోని మారుమూల మండలాల్లోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడి ఉపాధ్యాయులు సంగారెడ్డి, పటాన్‌చెరు మండలాలకు బదిలీలు, పదోన్నతులపై వెళ్లారు. ముఖ్యంగా కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, మనూరు, రాయికోడ్, నాగల్‌గిద్ద, ఝరాసంగం తదితర మండలాల్లోనే ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు విన్నవిస్తాం: వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారిపాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు సేకరించాం. ఖాళీ పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ఈ పోస్టుల్లో విద్యా వాలంటీర్లను నియమించాలని విన్నవిస్తాం.

# కళ తప్పిన చెరువు

సంగారెడ్డి :కల్హేర్ మండలం కాముని చెరువు కింద 355 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం 40 ఎకరాల్లో బోర్ల కింద మాత్రమే వరినాట్లు వేశారు. చెరువులో అరకొరగా నీరుండమే కారణం.

కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువు కింద 2600 ఎకరాల ఆయకట్టు ఉంది.. జల వనరు నిండకపోవడంతో బోర్ల కింద 250 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. మిగతా భూములు పడావుగా దర్శనమిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో జల వనరులు కళ తప్పాయి. అత్యధిక మంది రైతులు చెరువులు, కుంటల ఆధారంగానే పంటలు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాధారంగా పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా పత్తి, వరి, సోయాబీన్, కంది, మినుము, పెసర తదితర రకాలు వేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఏడు చెరువుల్లో మాత్రమే పూర్తిస్థాయి నీరుంది. మిగతా వీటి కింద బోర్లు ఉన్న వారు మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. ఇతర భూములు బీడుగా ఉన్నాయి. నిత్యం ఆకాశంలో కారు మబ్బులు కనిపిస్తున్నా.. చిరు జల్లులు మాత్రమే కురుస్తుండగా అన్నదాతలు దిగులు చెందుతున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడక పోవడమే ప్రధాన కారణమని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి సాగుపై ప్రభావం: ఏసయ్య, ఎస్ఈ, నీటిపారుదల శాఖ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో నీటి వనరులలో నిల్వ తగ్గింది. చెరువులు, కుంటల్లో సరిపడా జలాలు లేకపోవడంతో రైతులు చాలా చోట్ల సాగుకు దూరంగా ఉన్నారు. పొలాలు పడావుగా ఉన్నాయి. ప్రధానంగా వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నారు పోసినా నాట్లు వేయలేదు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల కింద వరి సాగవుతోంది.

# అరకొర చదువులు..!

ఖమ్మం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరతతో బోధన కుంటుపడుతోంది. 2014 నుంచి ఒప్పంద అధ్యాపకుల నియామక ప్రక్రియ నిలిచిపోయింది. ఖాళీ పోస్టుల్లో పది శాతం.. ఉన్నత విద్యలో పనిచేసే బోధనేతర సిబ్బందితో నింపాల్సి ఉంటుంది. వీటిని 2019 వరకే నింపారు. మిగిలిన 90 శాతంలో రిటైర్ అయిన లేదా బదిలీల వల్ల ఖాళీలు ఏర్పడితే.. కొంతమంది అతిథి అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 21 జూనియర్ కళాశాలల్లో 3,483 మంది చదువుతుంటే.. భద్రాద్రి జిల్లాలో 14 కళాశాలల్లో 2,269 మంది అభ్యసిస్తున్నారు. జనరల్ కోర్సుల బోధనకు ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రొఫెషనల్ కోర్సులు చదివిన నిరుద్యోగులు.. అతిథి అధ్యాపకుల పోస్టుల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపకపోవటంతో వృత్తి విద్యాబోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో డిగ్రీ కళాశాలలు పదింటిలో 9,550 మంది విద్యార్థులు చదువుతున్నారు. అశ్వారావుపేటకు ఇటీవల కళాశాల మంజూరైంది. పోస్టులు కేటాయించలేదు. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 800 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇక్కడ ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు ముగ్గురు అధ్యాపకులు అవసరమవగా ఒక్కరే పనిచేస్తున్నారు. ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో 'చరిత్ర' బోధనకు ఒక్కరూ లేరు. గణితం అధ్యాపకులు అయిదుగురు



అవసరమవగా ఒక్కరే పనిచేస్తున్నారు. ఈకళాశాలల్లో మొత్తమ్మీద 27 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 13, భద్రాచలం కళాశాలలో 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అతిథి అధ్యాపకుల పోస్టులకు ఇంతవరకు నోటిఫికేషన్ వెలువడలేదు. తెలుగు సబ్జెక్టులో అయిదు, ఇంగ్లిష్-13, గణితం-08, భౌతికశాస్త్రం-07, రసాయనశాస్త్రం-08, వృక్షశాస్త్రం-08, జంతుశాస్త్రం-05, కంప్యూటర్ సైన్స్-07, చరిత్ర-11, రాజనీతిశాస్త్రం-03, ఆర్థికశాస్త్రం-05, వాణిజ్యశాస్త్రం-06, బయోటెక్నాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఒక్కొక్కటి, లైబ్రేరియన్-06, పీడీల పోస్టులు ఏడు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు 58 మంది అతిథి అధ్యాపకులు అవసరం. గతంలో పనిచేసిన వారిలో కొందరు కళాశాలలకు వచ్చి బోధిస్తున్నారు. వీరిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు.కె. రవిబాబు, డీఐఈఓ, ఖమ్మం

# కన్నేసి..కాజేసి..!

నకిరేకల్ : హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 70 కిలోమీటర్ల పొడవుతో నకిరేకల్ నియోజకవర్గం విస్తరించి ఉంది. దీని వెంట ఉన్న స్థలాలకు విలువ పెరగడంతో హైవేకు ఇరువైపులా గ్రామాల్లోని చెరువులు, కుంటలను అక్రమార్కులు చెరబడుతున్నారు. చెరువుల్లో హద్దులు ఏర్పాటు చేసి కంచెలు చుట్టేస్తున్నారు. పూర్వ కాలం నాటి సాగు పట్టాలను ఆసరా చేసుకుని, వాటికి రిజిస్ట్రేషన్లు పుట్టించి యథేచ్ఛగా విక్రయాలకు పాల్పడుతున్నారు. మరి కొన్ని నీటి వనరులను మింగేసేందుకు సమీపంలోని సర్వే నెంబర్లతో కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తూ చెరువులు, కుంట శిఖాలను అంటగడుగున్నారు.

హైవే వెంట గత కొన్నేళ్ల నుంచి రూ. వందల కోట్ల విలువైన భూ దందా సాగుతున్నా.. నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. సాక్షాత్తు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల



వీరేశం జిల్లాలో, నకిరేకల్ నియోజకవర్గంలో నీటి వనరుల ఆక్రమణలపై సీఎంకు లేఖను రాయడం కలకలంగా మారింది.

నకిరేకల్ మండలంలో 48 చెరువులు, కుంటలు ఉన్నాయి. శిఖం భూములు 1700 ఎకరాల వరకు ఉన్నాయి. ఈ భూములు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి.

నకిరేకల్ పురపాలిక చుట్టూ 12 గొలుసుకట్టు చెరువులు, కుంటలున్నాయి. వీటి పరిధిలో 300 ఎకరాల శిఖం భూములున్నాయి. వీటిల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణల చెరలో ఉన్నాయి. ఇసాయికుంట శిఖం భూమిలో కొన్ని సంఘాల భవనాలను అక్రమంగా నిర్మిస్తున్నా పురపాలిక, నీటిపారుదల అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఆక్రమణలు ఇలా..692 సర్వేనెంబరులోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో 45 అక్రమ నిర్మాణాలు వెలిశాయి.

సర్వే నెంబరు 220లోని రంగసముద్రం కుంట 4.11 ఎకరాల శిఖం భూములు అన్యాక్రాంతమయ్యాయి.

సర్వే నెంబరు 89లోని దండకుంటకు 8.04 ఎకరాల శిఖం భూమి ఉంది. ప్రస్తుతం ఈ కుంట మాయమైపోయింది.

డకుంటలో పురపాలిక ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనానికి కాగితాలు పుట్టించి వనాన్ని నరికేసి కబ్జా పేట్టేశారు.

374 సర్వేనెంబరులోని సోమయాజి కుంటలో రెండు ఎకరాల శిఖం భూములను ఖతం పట్టిస్తున్నారు.

సర్వే నెంబరు 619లో 4.06 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెనగారివారి కుంట ఆక్రమణతో ఆనవాళ్లులేకుండా పోయింది.

470 సర్వే నెంబరులోని 16.36 ఎకరాల విస్తీర్ణంలోని యల్మవారికుంట శిఖాన్ని చెరపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం:- బి.పాండునాయక్, నీటిపారుదల ఏఈ, నకిరేకల్ మండలం, పురపాలిక పరిధిలోని చెరువులు, కుంటల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణలపై సమగ్ర వివరాలు సేకరిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో చర్యలు చేపడతాం.

# పదేళ్లుగా పనిచేస్తున్న.. ఉద్యోగోన్నతులు సున్నా!



ఖమ్మం : విద్యుత్తు సంస్థలో ఉపకేంద్రాల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లు, వివిధ విభాగాల్లో వాచ్‌మెన్లుగా ఆర్టిజన్ (ఔట్ సోర్సింగ్) కార్మికులు దశాబ్ద కాలానికి పైగా పనిచేస్తున్నారు. 2017 సెప్టెంబర్‌లో వీరిని ఆర్టిజన్ కార్మికులుగా యాజమాన్యం గుర్తించింది. ప్రభుత్వం ఆర్టిజన్లుగా గుర్తించి ఏడేళ్లు గడిచినా న్యాయం జరగటం లేదు. పని భారంతో శ్రమదోపిడీకి గురవుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిబంధనలు వర్తింపజేయలేదు. అందుకే ఉద్యోగోన్నతి పొందలేకపోతున్నామని కార్మికులు వాపోతున్నారు.

**ఖమ్మం సర్కిల్ పరిధిలో..**

టీజీఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ (జిల్లా) పరిధిలో 286 మంది ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో పీజీ అభ్యసించినవారు గ్రేడ్-1గా, డిగ్రీ చదివినవారు గ్రేడ్-2, పదోతరగతి అభ్యసించినవారు గ్రేడ్-3, నిరక్షరాస్యులు, పదోతరగతి లోపు చదివినవారిని గ్రేడ్-4 కార్మికులుగా విభజించారు. అయితే ఉపకేంద్రాల్లో ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికులు, ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నవారు పనిభారంతో సతమతమవుతున్నారు. సిబ్బంది తక్కువగా ఉండటంతో అధిక గంటలు పనిచేయిస్తున్నారు. అలాగే ముగ్గురు, నలుగురు పనిచేయాల్సిన ప్రాంతంలో ఇద్దరితో సరిపుచ్చుతున్నారు. తద్వారా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఇతర ఉద్యోగులకు అధిక గంటలు పనిచేస్తే అదనపు వేతనం ఇస్తున్నారు. కానీ వీరికి ఆ సౌకర్యమూ లేదు. అలాగే ఇతర విభాగాల్లోనూ అధికారులు పనులు చేయిస్తున్నారు. ఒకే సంస్థలో ఒకే విధమైన విధులు నిర్వర్తించే సిబ్బంది వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉంటోందని కార్మికులు ఆరోపిస్తున్నారు.

సాధారణంగా ఉద్యోగులు, కార్మికులకు ప్రొబేషనరీ పీరియడ్ ఐదేళ్లు గడిస్తే ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంది. ఆర్టిజన్ కార్మికులు ఇటీవల ఏడేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తిచేసుకున్నారు. వేతనం, ఇతర లబ్ధిలో నష్టం జరుగుతోందని వాపోతున్నారు. ప్రస్తుతం సంస్థలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరుగుతోంది. అయినా తమ ఉద్యోగోన్నతులపై అధికారులు చర్చించకపోవటంపై ఆర్టిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంస్థలోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పిస్తుండటంతో కొత్త ప్రభుత్వం తమకూ న్యాయం చేస్తుందని ఆర్టిజన్లు ఆశిస్తున్నారు. తమకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని కోరుతున్నారు. తక్షణమే ఉద్యోగోన్నతులు కల్పించాలని, సెలవులు, వేతనంలో వ్యత్యాసాన్ని సరిచేయాలని, అదనంగా పనిచేస్తే అదనపు వేతనమివ్వాలని విన్నవిస్తున్నారు. తెలంగాణ ఇంక్రిమెంట్లు అన్ని విభాగాల్లో ఇచ్చారని, తమకు కూడా అమలు చేయాలని, కొత్త కార్మికుల నియామకం చేపట్టి పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. ఆర్టిజన్ కార్మికుల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసి రెండేళ్లయ్యింది. ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్నాం. ఏపీఎస్ఈబీ నిబంధనలు వర్తింపజేయాలి. కొత్త కార్మికుల నియామకం చేపట్టి పని ఒత్తిడి తగ్గించాలి.- వల్లాల యుగంధర్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి, 327 సంఘం

# తటాకంలో..తలో వాటా..!




భువనగిరి : జిల్లాలో పలు చోట్ల చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్ని చోట్ల రియల్‌ఎస్టేట్ సంస్థల చెరలో బందీలయ్యాయి. కానీ వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.హెచ్ఎండీఏ పరిధిలోని భువనగిరి, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం మండలాలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగిన యాదగిరిగుట్ట, రాజాపేట, ఆలేరు మండలాల్లో పలు చెరువులు కబ్జాకు గురయ్యాయి. హెచ్ఎండీఏ, నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా హెచ్ఎండీఏ పరిధిలోని మండలాల్లోని చెరువులు, కుంటల కబ్జాపై సర్వే నిర్వహించి 200పైగా చెరువు కుంటలు పాక్షికంగా ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు.ప్రధానంగా భువనగిరి పెద్ద చెరువు, బీబీనగర్ చెరువు ఆక్రమణలకు గురవడంతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరిగినట్లు తేలింది. చర్యలు తీసుకునేందుకు నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు వెనుకడుగు వేయడం గమనార్హం. బీబీనగర్ పెద్ద చెరువు పరిధిలోని బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టగా గతంలో తొలగించారు. ఇంకా కొన్ని అలాగే ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణంలోని నాగుల కుంటలో ఆక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

భువనగిరి పెద్ద చెరువును ఆక్రమించి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్ వేసింది. దాదాపు ఐదేళ్ల క్రితమే ఆక్రమణ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, విద్యుత్ స్తంభాలు వేశారు. చెరువు నీరు లోనికి రాకుండా మధ్యలో మట్టిపోసి అడ్డుగా మట్టితో కట్ట పోశారు. చెరువు విస్తీర్ణం 232 ఎకరాలు ఉంది. 30 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. ఈ ప్రదేశంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ నిబంధనలు ఉల్లంఘించి రియల్‌ఎస్టేట్ సంస్థ వెంచర్ చేసింది. నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేసి 8 ఎకరాల్లో వెంచర్ వేసినట్లు తేల్చి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఏడాది గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తమ ప్రభుత్వ అనుమతి ఉందని రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు బుకాయిస్తున్నట్లు సమాచారం.

తాఖీదులు ఇచ్చాం: భరత్, ఎఈఈ, నీటిపారుదల శాఖ, భువనగిరి చెరువులో ఆక్రమణలు తొలగించాలని సదరు సంస్థకు గతంలోనే తాఖీదులు ఇచ్చాం. తాము సర్వే చేయగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఎనిమిది ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తేలింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. చెరువులో పోసిన కట్టను తొలగిస్తామని రియల్ ఎస్టేట్ సంస్థ జవాబు ఇచ్చిందన్నారు.

# అక్రమాల్లో స్టాంపు



హైదరాబాద్:రాజధాని సమీప జిల్లాల్లో మాజీ సర్పంచుల పేరుతో నిర్మాణ అనుమతుల కుంభకోణం హైడ్రా పరిశీలనతో వెలుగులోకి వచ్చింది. నిబంధనలను తుంగలోకి తొక్కి పదేళ్ల కిందటే మాజీగా మారిన సర్పంచుల అనుమతులు తీసుకున్నట్లు చూపించి నగర సమీప జిల్లాల్లో వేలాది అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలో హైడ్రా అధికారులు ఇప్పుడు దీనిపై కూడా దృష్టిపెట్టి ఈ తప్పుడు వ్యవహారంలో పాత్ర ఉన్న మాజీ సర్పంచులు, ఇతర అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు.

నిబంధనల ప్రకారం భవన నిర్మాణాల అనుమతుల విషయంలో హెచ్ఎండీఏతోపాటు గ్రామ పంచాయతీలు కూడా కొన్ని నిబంధనలను పాటించాలి. ఓఆర్ఆర్ దాటిన తరువాత హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తుంది కాబట్టి ఎవరైనా 1200 గజాలకు మించిన స్థలంలో నిర్మాణం చేయాలంటే హెచ్ఎండీఏ అనుమతి ఉండాలి. తక్కువ విస్తీర్ణంలో జీ౦2 అంతస్తుల్లో నిర్మాణాలకు హెచ్ఎండీఏ సాంకేతిక అనుమతులు తీసుకున్న తరువాతే పంచాయతీ కార్యదర్శి అనుమతులు జారీ చేయాలి. కానీ శివారుల్లో ఇప్పుడు అలా జరగడం లేదు.కార్యదర్శిని కాదని సర్పంచులే..ఒకప్పటి పంచాయతీలు ఇప్పుడు మున్సిపాల్టీలుగా, నగరపాలక సంస్థలుగా మారాయి. కొన్నేళ్లుగా అక్కడ జరిగిన నిర్మాణాలు చూస్తే మాజీ సర్పంచి పేరుతో ఇప్పుడు కూడా అనుమతులు జారీ అవుతున్నాయి. నార్సింగితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో హైడ్రా అధికారులు కొన్ని నిర్మాణాలను పరిశీలిస్తే ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఎఫ్‌టీఎల్‌లో కొన్ని భవనాలు రెండేళ్ల కిందటే కడితే దానికి పదేళ్ల క్రితం మాజీగా మారిన సర్పంచి అనుమతి ఇచ్చినట్లు చూపించారు. అసలైతే ఆ అనుమతులతో సర్పంచికి సంబంధమే లేదు. పంచాయతీ కార్యదర్శే జారీ చేయాలి. కొన్ని పంచాయతీల్లో అసలు రికార్డులే లేవు. మాజీ సర్పంచులు ఇళ్లలో కొన్ని స్టాంపులున్నాయి. నిర్మాణదారులు ఫైలు తెస్తే మాజీ సర్పంచులు పాత తేదీలతో స్టాంపు వేసి సంతకం చేసి ఇస్తున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 200 భవనాలను తప్పుడు అనుమతులతో ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినట్లు హైడ్రా పరిశీలనలో తేలింది. మొత్తం మీద నగరం చుట్టుపక్కల జిల్లాల్లో తప్పుడు అనుమతులతో భవనాలు వేలల్లోనే నిర్మాణమైనట్లుగా తేలింది.

అటు రెవెన్యూ.. ఇటు హెచ్ఎండీఏ

మండల రెవెన్యూ అధికారులు కూడా అక్రమార్కులకు తోడ్పాటు అందించారు. ఏకంగా సర్వే నంబరునే మార్చి అక్రమార్కులకు తోడ్పాటునందించారు. తప్పుడు వివరాలతో వస్తే క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే హెచ్ఎండీఏ అనుమతులిచ్చినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. అక్రమాలకు తోడ్పడిన ఏస్థాయి అధికారి అయినా చర్యలకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

# విద్యుత్తు తీగల చోరీ

మెట్‌పల్లి : విద్యుత్తు ఫ్యూజులు పట్టుకొని చూపిస్తున్న ఈ రైతు మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన సామ గంగారెడ్డి. వరద కాలువకు మోటారు అమర్చుకొని పంట పొలానికి సాగునీరందిస్తున్నాడు. మూడ్రోజుల కిందట స్టార్టర్ బాక్సులో ఫ్యూజులు తీసేసి మోటారుకు అనుసంధానించిన విద్యుత్తు తీగను కత్తిరించి అపహరించుకుపోయారు. దీనివల్ల రూ. 5 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని వాపోయారు.

అన్నదాతలకు ఆర్థిక భారం

కాలువల వెంబడి సాగునీటి కోసం అన్నదాతలు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ పంపుసెట్లకు ఉన్న విద్యుత్తు తీగల్లో రాగి తీగే లక్ష్యంగా చేసుకొని దొంగలు చెలరేగిపోతున్నారు. ఒకేసారి ఇరవై, ముప్పై విద్యుత్తు మోటార్ల తీగలను దోచుకెళ్తున్నారు. దీంతో అన్నదాతలకు ఆర్థికంగా భారమవుతోంది. పలుమార్లు విద్యుత్తు తీగలు చోరీకి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఎస్సారెస్పీ కాకతీయ, వరద కాలువలతో పాటు వాగుల వెంబడి వందలాది మంది రైతులు వ్యవసాయ పంపుసెట్లు ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు సాగు



నీరందిస్తున్నారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, కథలాపూర్, జగిత్యాల, మేడిపల్లి, మల్యాల తదితర మండలాల గుండా వెళుతున్న కాలువల్లో, వాగుల్లో విద్యుత్తు మోటార్లు అమర్చి ఒడ్డున స్టార్టర్ బాక్సు అమర్చుకొని విద్యుత్తు తీగలతో అనుసంధానించి నీటిని పారిస్తున్నారు. తరచూ మోటార్లకు అమర్చిన తీగలు అపహరణకు గురవుతున్నాయి.

అర్ధరాత్రి వేళ అపహరణ..

కాలువల వెంబడి ఉన్న వ్యవసాయ పంపుసెట్ల వద్ద అర్ధరాత్రి దొంగలు అపహరణకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి సంచారం తక్కువగా ఉండడం, సులువుగా తప్పించుకునే అవకాశం ఉండడంతో అదను చూసి తీగలను కత్తిరించి ఎత్తుకెళుతున్నారు. ఒకేసారి వరసగా ఉన్న ఇరవై, ముప్పై మోటార్ల తీగలను కత్తిరించుకుని వెళుతున్నారు. అందులోని రాగి తీగను వేరు చేసి దానిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో వెల్లుల్ల, ఆత్మకూర్‌తో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో ఇదే తరహా ఘటనలు జరిగాయి. ఇవే కాకుండా చిన్న విద్యుత్తు నియంత్రికలను సైతం పగులగొట్టి రాగి తీగ ఎత్తుకెళ్లడంతో పాటు విద్యుత్తు నియంత్రిక మరమ్మతు కేంద్రంలో కూడా చోరీ చేసిన సందర్భాలు ఉన్నాయి.

గతంలో మెట్‌పల్లి డివిజన్ పరిధిలో పోలీసులు రాగి తీగ దొంగలను పట్టుకున్నారు. అయినా అదను చూసి దొంగలు అన్నదాతల వ్యవసాయ మోటార్లపై నజర్ పెట్టి తీగలు అపహరించుకుపోతున్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని సంప్రదించగా, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో కాలువల వెంబడి గస్తీ పెంచుతామని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే రైతులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని తెలిపారు.

# చెత్త సమస్యకు పరిష్కారం

కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో గుట్టలుగా పేరుకుపోతు న్న చెత్త నిల్వలతో డంపింగ్‌యార్డులు నిండిపోతున్నాయి. ప్రతి రోజు వచ్చే చెత్త ఎక్కడ వేయాలో తెలియని గందరగోళం నెలకొని ఉండగా.. కొత్తగా స్థలాలు సేకరించినా ఆయా ప్రాంతవాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉన్న చెత్తను తగ్గించడంతోపాటు నిల్వ ఉన్న వ్యర్థాలను శుద్ధి చేసేందుకు వీలుగా చెత్తతో విద్యుత్తు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.కరీంనగర్, రామగుండం నగరపాలికలతోపాటు పురపాలికల్లో చెత్త సేకరణ సవాల్‌గా మారింది. సేకరిస్తున్న చెత్తలో తడి, పొడి వేరు చేస్తుండగా పొడి చెత్త 90 శాతం వస్తుండటంతో దీనిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఎక్కడ చూసిన నిల్వలు పెరిగిపోతుండగా ఎండాకాలంలో మంటలు వ్యాపిస్తుండటం, వాసన భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా స్థలాలు సేకరించడం సాధ్యం కాకపోవడంతో చెత్తతోనే విద్యుత్తు తయారీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఎంతమేర చెత్త ఉత్పత్తి అవుతుందనే వివరాలను



పురపాలక శాఖ వివరాలు సేకరించినట్లు తెలిసింది.

వరంగల్-కరీంనగర్ మధ్య ఉండే హుజూరాబాద్‌లో విద్యుత్తు ఉత్పతి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు జిల్లా పాలనాధికారి స్థల సేకరణ సేకరించినట్లు సమాచారం.కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి చెత్తను తీసుకొచ్చి విద్యుత్తు తయారు చేసేలా ప్రతిపాదనలు చేశారు.

పదేళ్ల కిందట సుగ్లాంపల్లిలో..

పదేళ్ల కిందట ఉమ్మడి జిల్లాలోని సుగ్లాంపల్లిలో చెత్త ద్వారా విద్యుత్తు తయారు చేసే ప్లాంట్ నడిపించారు. కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాల నుంచి చెత్తను తీసుకొచ్చి విద్యుత్తు తయారు చేశారు.

యూనిట్ ధర అధికంగా ఉండటంతో మూతపడింది. మళ్లీ చెత్తతో విద్యుత్తు తయారీ చేయాలనే ప్రతిపాదనలు రావడంతో డంపింగ్‌యా ర్డులు ఖాళీ అవుతాయనే ఆలోచనలో ఉన్నారు. ప్లాంట్ ఏర్పాటు సకాలంలో జరిగితే పట్టణాలు, నగరాల్లో చెత్త సమస్యకు ముకుతాడు పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ. 16 కోట్లతో బయోమైనింగ్..కరీంనగర్ నగరపాలిక పరిధిలో స్మార్ట్‌సిటీ నిధులు రూ. 16 కోట్లతో బయోమైనింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏడాదిన్నర కిందట ప్రారంభించిన ఈ పనులతో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తలో కేవలం 80 వేల మె.ట చెత్త మాత్రమే ప్రాసెసింగ్ చేశారు. ఓ వైపు శుద్ధి చేస్తుండగా.. మరో వైపు చెత్త తీసుకొచ్చి పోస్తుండటంతో వ్యర్థాలు ఎంతమేర తగ్గిందనేది తెలియకుండా మారుతుంది.




## శివాజీ విగ్రహం కూలిన ఘటన.. నా తలవంచి క్షమాపణలు చెప్తున్నా: మోదీ

ముంబయి: మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై తాజాగా ప్రధాని మోదీ క్షమాపణలు తెలియజేశారు. "నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను" అని వెల్లడించారు.

"ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు" అని మోదీ మాట్లాడారు. ఈ రోజు మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది.

35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి, నాణ్యత మీద లేదని దుయ్యబట్టాయి.




## సామూహిక వరలక్ష్మీ వ్రతాలు.. చీరలు పంపిణీ చేసిన నాగబాబు సతీమణి

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో శ్రావణ మాస ఆఖరి శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభమయ్యాయి. పూజల్లో పాల్గొనే ఆడపడుచులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చీరలు, పూజా సామగ్రి ఉచితంగా సమకూర్చారు. వాటిని పూజల్లో పాల్గొన్న మహిళలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ అందజేశారు. అనంతరం వరలక్ష్మీ వ్రతమాచరించారు.




అమరావతి: దేశీయ మొక్కలు పచ్చదనంతో రాష్ట్రం కళకళలాడాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ (%ఖుఖుఖ ఖుఖ్రీ.ఖుఆ%) పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఇది సామాజిక బాధ్యత అని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "అన్య జాతుల మొక్కలను పెంచడం మానేద్దాం. దేశవాళీ జాతుల మొక్కలే పర్యావరణానికి నేస్తాలు. వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. అరబ్ దేశాలే కోనో కార్పస్ మొక్కలను వద్దనుకున్నాయి. పచ్చదనం కోసం ఆ జాతి మొక్కలను అక్కడ విరివిగా పెంచారు. అయితే తర్వాత వాటి దుష్ప్రభావం అర్థం చేసుకొని ఆ మొక్కను వద్దనుకొని నిషేధించాయి. దీని వల్ల జరిగే అనర్థాలు అధికంగా ఉన్నాయి. భూగర్భ జలసంపదను ఎక్కువగా వినియోగించుకోవడంతోపాటు చుట్టుపక్కల ఉన్నవారికి శ్వాస సంబంధ సమస్యలు వస్తాయి. కోనోకార్పస్ మొక్కను పశువులు తినవు. పక్షులు గూడుపెట్టుకోవు.. చెట్లను ఆశ్రయించే క్రిమికీటకాలు రావు. పక్షులే దూరంగా ఉండే ఈ మొక్కలను మనం పెంచుకోవడం సరికాదు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఈ మొక్కను నాటడం మానేయాలి. మన దేశంలోనూ తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, అస్సాం ప్రభుత్వాలు సైతం కోనోకార్పస్‌పై నిషేధం విధించాయి. అందరికీ మేలు చేసే మొక్కలే మన నేస్తాలు" అని పవన్‌కల్యాణ్ అన్నారు.

## గుడ్లవల్లేరు ఘటన.. ఆడబిడ్డ తల్లిగా తీవ్ర భయాందోళనకు గురిచేసింది: షర్మిల



విజయవాడ: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఇంజినీరింగ్ కళాశాల వాష్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరా ఘటనపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలల్లో పర్యవేక్షణ పట్ల యాజమాన్యాల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అమానవీయ ఘటన విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. "ఒక ఆడబిడ్డ తల్లిగా ఈ ఘటన నన్ను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. చదువు, సంస్కారం నేర్పాల్సిన విద్యాసంస్థలు.. పిల్లలకు ఏం నేర్పుతున్నాయోనన్న ఆలోచనలో పడేసింది.

ఉన్నత చదువుల కోసం ఆడపిల్లలను కాలేజీలకు పంపితే.. వారి మాన ప్రాణాలకు రక్షణ లేదనడానికి ఈ ఘటనే మరో నిదర్శనం. కాసుల కక్కుర్తి తప్ప.. భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు గాలికొదిలేశారనే దానికి ఈ ఘటనే ఉదాహరణ. దీనిపై సాధారణ విచారణ కాదు.. ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరగాలి. తక్షణమే ఉన్నతస్థాయి కమిటీ వేయాలి. సీనియర్ ఐపీఎస్ అధికారులతో విచారణ జరిపించాలి. బాత్ రూముల్లో కెమెరాలు పెట్టిందెవరో వెంటనే తేల్చాలి. ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిందే. మరోసారి ఇలాంటివి చేయాలంటేనే భయపడేలా చర్యలు ఉండాలి. బాత్ రూముల్లో రికార్డ్ అయిన ఏ వీడియో కూడా బయటకు రాకుండా చూడాలని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నాం. వారంలోపు బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే కళాశాలకు వెళ్తాం. విద్యార్థినులు కోరుకున్న న్యాయం జరిగే వరకు వారి పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది" అని షర్మిల పేర్కొన్నారు.




అమరావతి: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజిలో రహస్య కెమెరాలు పెట్టారనే అంశంపై జరుగుతున్న విచారణను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులు, మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా ఎమ్మెల్యేలలను కళాశాలకు వెళ్లాలని ఆదేశించిన సీఎం.. అక్కడ జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి విచారణ సాగుతున్న విధానంపై ఆరా తీశారు. విద్యార్థినుల ఆందోళన, ఆవేదనను పరిగణనలోకి తీసుకుని పటిష్ట దర్యాప్తు జరపాలని ఆదేశించారు. రహస్య కెమెరాల ద్వారా వీడియోల చిత్రీకరణ జరిగిందన్న విషయంలో.. నేరం రుజువైతే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఇంట్లో ఆడబిడ్డలకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో...అంతే సీరియస్‌గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఆందోళనలో ఉన్న వారికి భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. కాలేజీ యాజమాన్యం, అధికారుల అలసత్వం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఎవరూ అధైర్య పడొద్దని, తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఘటనపై విచారణకు సంబంధించి ప్రతి 3 గంటలకు ఒకసారి తనకు రిపోర్ట్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## ముంబై నటి స్టేట్‌మెంట్ రికార్డు.. కన్నీరు పెట్టుకున్న జిత్వానీ




అమరావతి, ఆగస్టు 30: విజయవాడలోని ఓ హెూటల్‌లో ఉన్న ముంబై నటి జిత్వానీ నుంచి పోలీసులు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. ఇప్పటికే విచారణాధికారి స్రవంతి రాయ్ హెూటల్‌కు చేరుకున్నారు. విచారణ సమయంలో నటి కన్నీళ్లు పెట్టుకున్నారు. జిందాల్‌పై అత్యాచారం కేసు నుంచి వరుసగా జరిగిన ఘటనలు వివరించినట్లు సమాచారం. విటిపియస్ గెస్ట్ హౌస్‌లో బంధించిన సమయంలో ఏయే పోలీసులు ఎలా ఇబ్బంది పెట్టారో చెప్పి నటి కన్నీటి పర్యంతమయ్యారు. రేప్ కేసు పెట్టిన డిసెంబరు 2023 నుంచి కేసు కొట్టేసిన మార్చి 2024 వరకు జరిగిన ఘటనలు పోలీసులకు జిత్వానీ వివరించారు. ఆమె చెప్పిన అంశాలను స్టేట్‌మెంట్ రూపంలో, వీడియో రూపంలో విచారణ అధికారులు తీసుకున్నారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం జోడించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా... ముంబై నటి, వైద్యురాలు కాదంబరి జిత్వానీని తప్పుడు కేసులో ఇరికించి, ఆమె కుటుంబ సభ్యులనూ అరెస్టు చేసి, అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలు పెట్టిన కేసులో సీనియర్ ఐపీఎస్‌ల పాత్ర తేల్చేందుకు రంగం సిద్ధమైంది. రెండు తెలుగురాష్ట్రాలతో పాటు... ముంబైలో, సినీ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు విచారణాధికారిగా విజయవాడ ఏసీపీ కె.స్రవంతి రాయ్‌ని నియమించింది. డీజీపీ ఆదేశాల మేరకు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు గురువారం (ఆగస్టు 29) ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు నటి కాదంబరిపై కుక్కల విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేయడం... ఆ మరుసటి రోజునే ముంబైలో ఏపీ పోలీసులు ఆమెను అరెస్టు చేయడం జరిగింది. ఆ తర్వాత ఏపీలో తనను వేధించిన తీరుపై ఆగస్టు 1వ తేదీన ముంబై జుహూ పోలీసుస్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. "నన్ను, నా తల్లిదండ్రులను ఏపీ పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరి 3న అరెస్టు చేశారు. ఫిబ్రవరి 2న ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి, 24 గంటల్లోనే రోడ్డు మార్గాన విజయవాడ నుంచి ముంబై వచ్చి ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేశారు. ఆ సమయంలో మా లాయర్‌ను కానీ, బంధువులను కానీ సంప్రదించే అవకాశం కల్పించలేదు. విజయవాడ తీసుకెళ్లిన తర్వాత కూడా మాకు లాయర్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఇవ్వలేదు. మా అరెస్టు సమాచారాన్ని బంధువులకు తెలియజేశామని ఏపీ పోలీసులు చెప్పడం పెద్ద అబద్ధం. అలాగే... మా నివాసం నుంచి ఓ డాక్యుమెంట్‌ను రికవరీ చేశామని, దాని ఆధారంగానే అరెస్టు చేశామని చెబుతున్నారు. దానిని సృష్టించింది కూడా పోలీసులే. 2018లో అగ్రిమెంట్ చేసుకున్నట్లు ఆ డాక్యుమెంట్‌లో ఉంది. కానీ... అందులోని చిరునామా మాత్రం 2020లో నేను జుహూలో కొనుగోలు చేసిన ఫ్లాట్‌ది. అంతేకాదు... ఆ డాక్యుమెంట్ పేపర్‌ను 2023లో కొన్నారు. అది ఫోర్జరీ అని చెప్పేందుకు ఇవే నిదర్శనాలు" అని ఆ ఫిర్యాదులో కాదంబరి పేర్కొన్నారు.

## ఏపీలో సెప్టెంబర్ ఒకటి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం..



విజయవాడ: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ ముందుంటుందని, అందుకే ప్రజలు ముడోసారి మోదీని ప్రధానిని చేశారని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, రామమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించి పేదల పక్షాన నిలుస్తుంది కాబట్టే మూడోసారి తమ పార్టీకి పట్టం కట్టారని ఆమె చెప్పారు. విజయవాడలో నిర్వహించిన బీజేపీ యువ మోర్చా సమావేశంలో పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. "గుడ్లవల్లేరు కాలేజీలో విద్యార్థినిల బాత్ రూమ్?ల్లో సీసీ కెమెరాలు పెట్టిన ఘటన బాధాకరం. ఇలాంటి ఘటన సిగ్గుపడాల్సిన విషయం. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి. సెప్టెంబర్ ఒకటి ఏపీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. ఏపీలో కోటి మందికి సభ్యత్వం ఇవ్వడమే లక్ష్యం. 2014లో దేశవ్యాప్తంగా 11కోట్ల మంది సభ్యులుగా చేరారు. కరోనా కారణంగా ఐదేళ్లుగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయలేదు. ప్రస్తుతం 18కోట్ల మంది పార్టీలో సభ్యులుగా ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మా పార్టీపై దుష్ప్రచారం జరిగింది. అందువల్లే మేము 40, 50సీట్లు కోల్పోయాం. కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లకు కట్టుబడి ఉంది. రాజ్యాంగాన్ని తీసివేసే ప్రసక్తే లేదు. యువ మోర్చా నాయకులు కేంద్ర ప్రభుత్వం యువతకు అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. కొప్పర్తి, ఓర్వకల్లు రెండు ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది.

వేల కోట్ల రూపాయలతో అక్కడ పరిశ్రమలు రానున్నాయి. వీటి ద్వారా సుమారు లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది" అని చెప్పారు.




## ఉధృతంగా విద్యార్థుల ఆందోళన.. ఎస్పీ ప్రకటనపై మిన్నంటిన ఆగ్రహం

గుంటూరు: గుడివాడలోని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ వద్ద విద్యార్థుల ఆందోళన మరింత ఉధృతంగా మారింది. కాలేజీలోని బాలికల హాస్టల్‌లో వాష్ రూమ్స్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టారంటూ విద్యార్థులు రాత్రి నుంచి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. పోలీసుల జోక్యంతో కాస్త సద్దుమణిగినా.. తిరిగి ఇవాళ ఉదయం ఆందోళన ప్రారంభమైంది. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థులు నినాదాలు చేస్తున్నారు. వి వాంట్ జస్టిస్ అంటూ అంటూ ధర్నా చేస్తున్న విద్యార్థిని విద్యార్థులు స్లోగన్స్ ఇస్తున్నారు. అయితే గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సీసీ కెమెరాలు ఎక్కడా కనిపించలేదంటూ ఇవాళ ఉదయం జిల్లా ఎస్పీ ఒక ప్రకటన జారీ చేశారు. దీనిపై విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయ సంఘాలు సైతం మండిపడుతున్నాయి. కాగా.. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించిన విషయం తెలిసిందే. పూర్తి స్థాయిలో దర్యాప్తునకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలను తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు. తాజాగా ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సైతం స్పందించారు. ఈ ఘటనను ఆయన ఖండించారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందవద్దని.. అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాము గురువారం రాత్రి కళాశాలలో జరిగి పరిణామాలపై తాజాగా స్పందించారు. కళాశాలలో విద్యార్థులు చేస్తున్న ఆరోపణలపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారు ఉన్న ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. దయచేసి విద్యార్థులు అపోహలను నమ్మవద్దని, ఆధారాలు లేని విషయాలను ప్రచారం చేయవద్దంటూ ఎమ్మెల్యే రాము సూచించారు. ఎటువంటి వివక్షత లేకుండా గుడ్లవల్లేరు ఘటనపై దర్యాప్తు జరుగుతుందని.. విద్యార్థులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. విద్యార్థి లోకానికి తాను అన్ని వేళల అండగా ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా ఇచ్చారు.

## ఏపీలో ఉద్యోగుల బదిలీల గడువు పొడిగించిన ప్రభుత్వం



అమరావతి: ఉద్యోగుల బదిలీలు చేపట్టేందుకు మరో 15 రోజులపాటు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెప్టెంబరు 15 వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సెప్టెంబరు 16 నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికీ చాలా ప్రభుత్వశాఖలు బదిలీల విధివిధానాల్ని రూపొందించుకోకపోవటంతో గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ, రెవెన్యూ, రహదారులు భవనాలు, రవాణాశాఖలకు చెందిన బదిలీ మార్గదర్శకాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విధివిధానాల రూపకల్పలోనే వివిధ శాఖలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## మత్తు వదిలించే చిట్టి లుక్ చూశారా..!

2019లో వచ్చిన సూపర్ హిట్ క్రైమ్ కామెడీ చిత్రం మత్తు వదలరా కి సీక్వెల్ రూపొందింది. మొదటి భాగంకు దర్శకత్వం వహించిన రితేష్ రానా దర్శకత్వంలోనే ఈ సీక్వెల్ రూపొందింది. మత్తు వదలరా 2 సినిమాలో శ్రీ సింహా, నరేష్ అగస్త్య లు హీరోలుగా నటించగా కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. వీరి ముగ్గురి కాంబోలో వచ్చే కామెడీ సన్నివేశాలు కచ్చితంగా ప్రేక్షకులను నవ్విస్తాయని, మరో విజయాన్ని దక్కించుకోవడం ఖాయం అంటూ చిత్ర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా కనిపిస్తున్నారు. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మత్తువదలరా సినిమాలో జాతిరత్నాలు ఫేం చిట్టి అలియాస్ ఫరియా అబ్దుల్లా కీలక పాత్రలో కనిపించబోతుంది. పోలీస్ ఆఫీసర్ నిధి గా ఫరియా కనిపించబోతుంది. అందుకు సంబంధించిన పోస్టర్ ను తాజాగా మేకర్స్ రిలీజ్ చేశారు. ఫరియా పర్సనాలిటీకి తగ్గట్లుగా నిధి పాత్ర లుక్ ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కామెడీ పాత్రలకు




బాగా సెట్ అవుతున్న ఫరియా అబ్దుల్లా మరోసారి ఈ సినిమాలో కామెడీ తో అలరించే అవకాశం ఉందని భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా సీరియస్ ఆఫీసర్ గా, చేతిలో గన్ తో కనిపించి సర్‌ప్రైజ్ చేసింది. జాతిరత్నాలు సినిమా తర్వాత ఫరియా అబ్దుల్లాకి చాలా అవకాశాలు వచ్చాయి. కానీ ఎక్కువ శాతం బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. కొన్ని సినిమాల్లో పెద్దగా ప్రాముఖ్యత లేని పాత్రల్లో కనిపించింది. కానీ మత్తువదలరా 2 సినిమాలో మాత్రం కీలక పాత్రలో కనిపించబోతున్నట్లుగా ఫస్ట్ లుక్ పోస్టర్ ను చూస్తే అర్థం అవుతోంది. సూపర్ హిట్ మూవీ కి సీక్వెల్ అవ్వడంతో సహజంగానే మత్తువదలరా 2 పై అంచనాలు భారీగా ఉంటాయి. ఆ అంచనాలకు తగ్గట్లుగా ఈ సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ సభ్యులు అంటున్నారు. నిధి పాత్ర ఫస్ట్ లుక్ ను విడుదల చేసిన మేకర్స్ అతి త్వరలోనే టీజర్ ను కూడా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న కారణంగా ఒకటి రెండు రోజుల్లోనే ప్రమోషన్ కార్యక్రమాలు కూడా షురూ చేసే అవకాశాలు ఉన్నాయి. దర్శకుడు రితేష్ రానా గత సినిమాలో మాదిరిగానే ఈ సీక్వెల్ లో కూడా క్రైమ్ కామెడీ కథ ను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాడు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా మత్తు వదలరా 2 సినిమా ఉంటుందని హీరోలు శ్రీ సింహా మరియు నరేష్ అగస్త్య లు అన్నారు.

## గుంటూరు రాజీ భలే బిజీబిజీ

ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలలో హర్యానా నుంచి ప్రాతినిధ్యం వహించిన మీనాక్షి చౌదరి కిరీటాన్ని సొంతం చేసుకుంది. అదే ఏడాది మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 లో ఇండియా కి ప్రాతినిధ్యం వహించిన ఈ అమ్మడు రన్నపర్ గా నిలిచింది. మిస్ ఇండియా కిరీటం గెలుచుకున్న తర్వాత మీనాక్షి చౌదరి కి బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. 2021 లో ఇచట వాహనాలు నిలుపరాదు సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టింది. మొదటి సినిమాతో నిరాశ పరిచిన కూడా ప్రముఖుల దృష్టిలో పడటంలో సఫలం అయింది. ముఖ్యంగా స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ ఈమెకి ఆఫర్ ఇస్తానంటూ గతంలో ప్రకటించాడు. అన్నట్లుగానే గుంటూరు కారం సినిమాలో



రాజీ పాత్రను ఇచ్చాడు. గుంటూరు కారం సినిమాలో ప్రాముఖ్యత లేని పాత్ర అంటూ కొందరు విమర్శించినా కూడా దాని వల్ల వచ్చిన పాపులారిటీ కారణంగా వరుసగా సినిమాలకు కమిట్ అవుతోంది. ఇప్పటికే ఈ అమ్మడు తెలుగు లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెల్సిందే. చిరు మూవీ కాకుండా విశ్వక్‌సేన్ హీరోగా రూపొందుతున్న మెకానిక్ రాకీ, వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న మట్కా సినిమాలను చేస్తుంది. అన్నింటి కంటే ముఖ్యంగా తమిళ సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో ఈ అమ్మడు హీరోయిన్ గా నటిస్తోంది. ఇవి కాకుండా మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. రాబోయే రెండేళ్ల కాలంలో మీనాక్షి చౌదరి నటించిన పది సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు కారం నిరాశ పరిచిన గుంటూరు రాజీ మాత్రం భలే బిజీ బిజీ అని ఆమె సన్నిహితులు మాట్లాడుకుంటున్నారు.




## తెలుగులో చప్పబడిపోతున్న దళపతి క్రేజ్.. కారణం అదేనా?



తమిళ్ స్టార్ హీరో దళపతి విజయ్ కు టాలీవుడ్ లో కూడా మంచి డిమాండ్ ఉంది. రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్న విజయ్ చేసే లాస్ట్ రెండు ప్రాజెక్ట్స్ లో ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం (గోట్) మూవీ మొదటిదిగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. సెప్టెంబరు 5వ తారీఖున ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. విజయ్ సినిమా విడుదల కావడానికి వారం రోజుల సమయం ఉంది అంటే హడావిడి ఏ రేంజ్ లో ఉంటుందో అందరికీ తెలుసు. అయితే రొటీన్ కి భిన్నంగా ఈసారి సోషల్ మీడియాలో ఎక్కడ ఫ్యాన్స్ హంగామా కనిపించడం లేదు. గత ఎడాది బాలకృష్ణ, రవితేజ పోటీ తట్టుకొని తెలుగులో లియో చిత్రం నిలబడి కమర్షియల్ గా సక్సెస్ సాధించింది.

దీన్ని బట్టి తెలుగులో విజయ్ మార్కెట్ ఏ రేంజ్ లో ఉందో అర్థమవుతుంది. అందుకే అతని కొత్త మూవీ వస్తుంది అంటే తమిళ్ తో పాటు తెలుగులో కూడా ఎంతో కొంత హడావిడి కనిపిస్తుంది. తెలుగు స్టార్ హీరోల సినిమాల లాగే విజయ్ సినిమాకి కూడా ఇక్కడ థియేటర్ డిస్ట్రిబ్యూషన్ హక్కులకు భారీ డిమాండ్ ఉంది.గోట్ మూవీపై మంచి టాక్ ఉంది.. అని ఎక్కడ కనిపించాల్సిన రేంజ్ లో బజ్ మాత్రం కనిపించడం లేదు. ఇక ఈ మూవీ డైరెక్టర్ వెంకట్ ప్రభు కావడం చిత్రంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. గతంలోవెంకట్ ప్రభు నాగచైతన్యతో కస్టర్డ్ ఇలాంటి భారీ డిజాస్టర్ ను తీశాడు. దీంతో అతను తీసే సినిమాలపై బ్రాండ్ ఇమేజ్ పనిచేయడం లేదు. విజయ్ సినిమాలలో మ్యూజిక్ కి ఎంత ప్రాధాన్యత ఉంటుందో అందరికీ తెలుసు. మరి ముఖ్యంగా గత కొద్ది కాలంగా విజయ్ సినిమాలు అంటే అనిరుద్ రవిచంద్ర మ్యూజిక్ చేస్తాడు అన్న బ్రాండ్ ఉంది. అయితే దీన్ని మారుస్తూ అతని స్థానంలో యువన్ శంకర్ రాజా రావడం.. సినిమాపై ఉన్న బజ్ ని బాగా తగ్గించింది. ఇక ఈ మూవీలో విజయ్ చిన్నప్పటి పాత్ర చూపించడానికి ఉపయోగించిన ఏఐ డీ ఏజింగ్ టెక్నాలజీ చిత్రంపై కాస్త నెగెటివిటీని పెంచినట్లు కనిపిస్తోంది. మరోపక్క తమిళ్ లో విజయ్ ప్రమోషన్స్ బాగా చేస్తున్నారు.. కానీ ఆ రెంజ్ ప్రమోషన్స్ తెలుగులో మాత్రం చేయడం లేదు. విజయ్ ఈ మూవీ ప్రమోషన్ కోసం హైదరాబాద్ కి వచ్చే ఛాన్స్ అయితే లేదు.. ఇక సినిమాలో మిగిలిన ముఖ్యపాత్రలతో ప్రమోషన్ ఈవెంట్ కానివ్వాలి. వీటన్నిటి వల్ల తెలుగులో విజయ్ సినిమాకి ఆశించిన స్పందన కనిపించడం లేదు అని టాక్.

## రాబోయే టాప్ 10 మూవీస్.. ఎన్టీఆర్, బన్నీ డామినేషన్!



ప్రతి ఏడాది లాగే.. ఈసారి కూడా ఐఎండీబీ (ఇంటర్నెట్ మూవీ డేటాబేస్) పాపులర్ ఇండియన్ సినిమాస్, మోస్ట్ అవైటెడ్ మూవీస్ జాబితాలను రీసెంట్ గా రిలీజ్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఐఎండీబీకి ఉన్న మిలియన్లకు పైగా నెలవారీ విజిటర్స్ రియల్ పేజ్ వ్యూస్ ఆధారంగా జాబితాలను రూపొందించింది. ప్రస్తుతం ఈ రెండు లిస్టులు.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. అయితే 2024 సెకండాఫ్ లో భారీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో మోస్ట్ అవైటెడ్ మూవీస్ లిస్ట్ ను ఐఎండీబీ విడుదల చేయడం గమనార్హం.

ఆ జాబితాలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప-2 మూవీ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఇక పుష్ప-2 టాప్ లో ఉండడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. మోస్ట్ అవైటెడ్ మూవీస్ లిస్ట్ లో రెండో స్థానంలో ఉన్న దేవర మూవీ సెప్టెంబర్ 27వ తేదీన విడుదల కానుంది. జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న దేవరపై మంచి అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సెకెండ్ సింగిల్ ను రిలీజ్ చేయనున్నారు మేకర్స్. మరి టాప్ 10లో ఉన్న మిగతా సినిమాలు ఏంటంటే? 1. పుష్ప: ది రూల్ 2. దేవర- పార్ట్ 1 3. వెల్ కమ్ టు ది జంగిల్ 4. ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ 5. కంగువ 6. సింగం ఎగైన్ 7. భూల్ భులయ్యా 3 8. తంగలాన్ 9. ఔరో మే కహా దమ్ థా 10. స్త్రీ 2 అక్షయ్ కుమార్, దిశా పటానీ లీడ్ రోల్స్ లో నటిస్తున్న వెల్‌కమ్ టు ది జంగిల్ మూవీ 2024 డిసెంబర్ 20వ తేదీన రిలీజ్ కానుంది. విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. సూర్య కంగువ అక్టోబర్ 10వ తేదీన థియేటర్లలో సందడి చేయనుంది. సింగం ఎగైన్ చిత్రం నవంబర్ 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. భూల్ భులయ్యా 3 దీపావళి కానుకగా అక్టోబర్ 31న, విక్రమ్ తంగలాన్ ఆగస్టు 15న, ఆరోన్ మే కహన్ దమ్ థా ఆగస్టు 2న, స్త్రీ 2 ఆగస్టు 15న రిలీజ్ కానున్నాయి. మరి ఈ ఐఎండీబీ రిలీజ్ చేసిన టాప్ 10 మోస్ట్ అవైటెడ్ మూవీస్ ఎలాంటి హిట్ అవుతాయో చూడాలి.

## అందంతో తడాఖా చూపిస్తున్న ముద్దుగుమ్మ

తమిళ బ్యూటీ ఆండ్రియా జెరేమియా మోడల్ గా, హీరోయిన్ గా, సింగర్ గా అలరించి మల్టీ ట్యాలెంటెడ్ అనిపించుకుంది. తమిళంలో పలువరు స్టార్ హీరోలకు జోడీగా నటించిన ఈ అమ్మడు ఇతర భాషల్లో కూడా నటించింది. తెలుగు లో ఆండ్రియా తడాఖా సినిమాలో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమాలో మరో హీరోయిన్ గా తమన్నా నటించడం వల్ల ఆండ్రియాకు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు అనేది కొందరి అభిప్రాయం. అందుకే తెలుగు లో ఆండ్రియా కి ఎక్కువ ఆఫర్లు రాలేదని, దాంతో ఆమె తమిళంకే పరిమితం అయ్యిందని సినీ విశ్లేషకులు అంటూ ఉంటారు. తెలుగు లో ఆండ్రియా నటించకున్నా కూడా ఆమె నటించిన పలు సినిమాలు తెలుగు లో డబ్ అయ్యాయి. తడాఖా సినిమాతో మెప్పించలేక పోయినా కూడా హీరోయిన్ గా తమిళ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. తెలుగు నుంచి ఒకటి రెండు ఆఫర్లు వచ్చినా కూడా సున్నితంగా వాటిని తిరస్కరించిందని సమాచారం. హీరోయిన్ గా



ఏడాదికి మూడు నాలుగు సినిమాలకు మించి చేస్తున్న ఆండ్రియా సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా సందడి చేస్తూ ఉంటుంది. నెట్టింట ఈమె రెగ్యులర్ గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ లో దాదాపుగా 3.5 మిలియన్ ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఆండ్రియా తాజాగా మరో అందమైన ఫోటోను షేర్ చేసింది. మెరూన్ కలర్ బ్లౌజ్ ధరించింది. చీరను విభిన్నంగా కట్టి ఆకట్టుకున్న ఆండ్రియా మరోసారి ఈ ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నడుము అందం చూపిస్తూ థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తున్న ఆండ్రియా ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ స్థాయిలో అందంగా ఉన్న ఆండ్రియాకు తెలుగు లో దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు, రావాల్సిన ఆఫర్లు రాలేదు అంటూ కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. తమిళ చిత్రం అన్నీయన్ లో కన్నుమ్ కన్నుమ్ నోకియా పాట పాడి ఇండస్ట్రీకి పరిచయం అయిన ఆండ్రియా తక్కువ సమయంలోనే పలు పాటలు పాడటంతో పాటు, నటిగా కూడా ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. హీరోయిన్ గా వరుస సినిమాలు చేసిన ఈ అమ్మడు తెలుగు, కన్నడ సినిమాల్లో కూడా నటించింది. ప్రస్తుతం కోలీవుడ్ లో ఈమె రెండు సినిమాల్లో నటిస్తోంది. ఆ రెండు సినిమాల షూటింగ్స్ వివిధ దశల్లో ఉన్నాయి. మరో రెండు మూడు చర్చల దశల్లో ఉన్నట్లు తెలుస్తోంది. నటిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అయినా కూడా ఇంకా బిజీ బిజీగానే ఈ అమ్మడు సినిమాలు చేయడం విశేషం.

## అంజలి ఇంటిమేట్ సీన్స్.. సెట్స్ లో అలా జరిగిందా?

హీరోయిన్ అంజలి.. ఓ వైపు సినిమాలు.. మరోవైపు వెబ్ సిరీసుల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతోంది. తనదైన శైలిలో మెప్పిస్తోంది. ఇటీవల మాస్ కా దాస్ విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో కీలక పాత్ర పోషించింది. తన యాక్టింగ్ తో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. రీసెంట్ గా బహిష్కరణ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది అంజలి. ఆ వెబ్ సిరీస్ లో వేశ్య పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. కొన్ని ఇంటిమేట్ సీన్స్ లో కూడా నటించింది. ఇప్పుడు ఆ సీన్స్ పై రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. ఇంటిమేట్ సీన్స్ చేసేటప్పుడు.. మేకర్స్ చాలా జాగ్రత్త పడ్డారని తెలిపింది. సెట్స్ లో ఉన్న అందరికీ బయటకు పంపి షూట్ చేశారని చెప్పింది. ఆ సీన్స్ షూట్ చేసే సమయంలో కాస్త కన్ఫ్యూజ్ అయ్యానని పేర్కొంది. ఇప్పటి వరకు ఇలాంటి సీన్స్ ఎప్పుడూ చేయలేదని వెల్లడించింది. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీ కోసం కూడా మాట్లాడింది అంజలి. సినిమాలో తాను చేసిన పాత్రకు



అనుకున్నదాని కంటే ఎక్కువ రెస్పాన్స్ వచ్చిందని తెలిపింది. తాను చేసే రోల్ కు ఎంతవరకు న్యాయం చేయాలనేది తన చేతిలోనే ఉంటుందని పేర్కొంది. ప్రతి మూవీకి కూడా స్పెషల్ గా హోం వర్క్ చేస్తానని చెప్పింది. రోల్స్ కోసం కష్టపడతానని తెలిపింది. తాను చేసిన పలు చిత్రాల్లో పాత్రలు డిమాండ్ చేసినందుకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నట్లు వెల్లడించింది. గతంలో తాను నటించిన నవరస సిరీస్ షూటింగ్ సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది అంజలి. కాస్ట్యూమ్స్ వల్ల అనేక గంటల పాటు వాష్ రూమ్ కు కూడా వెళ్లలేదని గుర్తు చేసుకుంది. తనకు సంబంధించి వచ్చే తప్పుడు వార్తలను చూసి వెంటనే మర్చిపోతానని తెలిపింది. వాటిని చదివినప్పుడు మాత్రం కాస్త బాధపడతానని చెప్పింది. టైమ్ వచ్చినప్పుడు పెళ్లి చేసుకుంటానని క్లారిటీ ఇచ్చింది అంజలి. ఇక త్వరలో అంజలి.. గేమ్ ఛేంజర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. డిసెంబర్ లో రిలీజ్ అవుతుంది. సినిమాలో రామ్ చరణ్ కు సతీమణిగా అంజలి కనిపించనుందని టాక్ నడుస్తోంది. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో అంజలి పాత్ర కీలకమని తెలుస్తోంది. మరి ఈ మూవీతో అంజలి ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.



# రాంనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

రాంనగర్: హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు చేపట్టింది. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు.

దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణాలు అక్రమమే అని నిర్ధరించిన అనంతరం హైడ్రా అధికారులు శుక్రవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. ఇక్కడ విక్రమ్‌యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతోందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని అందులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన యంత్రాంగం అక్కడి కల్లును పారబోసి పూర్తిగా సామగ్రిని తొలగించి.. కూల్చివేతలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే హైడ్రా చర్యలకు ఉపక్రమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# నైట్ డ్యూటీ అంటే వైద్యుల్లో భయం!

దిల్లీ: కోల్‌కతా వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనతో యావత్ దేశం ఉలిక్కిపడింది. విధుల్లో ఉన్న సమయంలోనే ఆమెపై అత్యంత పాశవిక దాడి జరగడం అటు వైద్యుల్లోనూ తీవ్ర అలజడి రేపింది. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించేందుకు కొందరు వైద్యులు భయపడుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది.

ముఖ్యంగా మహిళా డాక్టర్లు ఇందుకు వెనకడుగు వేస్తున్నారని తేలింది. ఆత్మరక్షణ కోసం విధులకు వచ్చేటప్పుడు ఆయుధాలను వెంట తెచ్చుకోవాలని భావిస్తున్నారని మరికొందరు లేడీ డాక్టర్లు చెప్పడం గమనార్హం. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో ఇటీవల చోటుచేసుకున్న వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో వైద్యుల భద్రతకు సంబంధించిన సమస్యలను అంచనా వేసేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇటీవల ఓ ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. ఇందులో 22 రాష్ట్రాలకు చెందిన 3885 మంది ప్రభుత్వ/ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

వీరిలో 85శాతం మంది 35ఏళ్లలోపు వారే. 61శాతం మంది ఇంటర్న్‌లు లేదా పీజీ వైద్యవిద్యార్థులే.



# తితిదే తరహాలో యాదగిరిగుట్టకు టెంపుల్ బోర్డు

## యాదగిరిగుట్ట అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్: యాదగిరిగుట్ట అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. టీటీడీ బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. భక్తులకు సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన వివరాలు ఇవ్వాలని అన్నారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా వదిలేయడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి స్టేటస్ రిపోర్టు తనకు అందించాలన్నారు. స్పీడ్ ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి కొత్త పాలసీ రూపొందించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోని ఉత్తమ పాలసీలను అధ్యయనం చేయాలని సూచించారు. ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వీటితోపాటు హెల్త్ టూరిజంను కూడా అభివృద్ధి చేయాలని తెలిపారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం పేర్కొన్నారు. ఉన్న వనరుల అభివృద్ధికి అవసరమైనచోట పీపీపీ విధానాన్ని అవలంభించాలని సలహా ఇచ్చారు. అవకాశం ఉన్నచోట హెలీ టూరిజం అభివృద్ధికి కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

**మిలాద్–ఉన్– నబీ ఏర్పాట్లపై సమీక్ష...** మిలాద్–ఉన్– నబీ ఏర్పాట్లపై సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ, ఉన్నతాధికారులు, వక్ఫ్ బోర్డు చైర్మన్, సభ్యులు, ఇతర ముస్లిం ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్‌లు పంపుతోంది: కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్యంగా మార్చవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం, చట్టం ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయత్నాన్ని మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చటం అమానవీయం, అన్యాయం అని గతంలో మీరే అన్నారని ప్రస్తావించారు. కాంగ్రెస్ అధినేత ఖర్గే మాటలను గుర్తు చేస్తూ ప్రశ్నించిన కేటీఆర్.. చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదల జీవితాలను ఆగం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ ఆ కుటుంబాలను నిరాశ్రయులు చేస్తున్నారని ఆక్షేపించారు. దీనికి మీ సమాధానం ఏమిటి?అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 మంది పేదల ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన ఘటనను 'ఎక్స్' వేదికగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మీ ప్రభుత్వం కూల్చేసిన 75 కుటుంబాల ఇళ్లలో 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవేనని తెలిపారు.

40 ఏళ్ల కిందట, 20 ఏళ్ల క్రితం ఇళ్లు కట్టుకొని నివాసం ఉన్న పేదల ఇళ్లను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేస్తుండటం ఎంత అమానవీయమో ఖర్గే చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం మరో బుల్డోజర్ రాజ్యం కాకుండా మీ పార్టీ ప్రభుత్వానికి సూచన చేయలంటూ ఖర్గేకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తేలేదు: బండి సంజయ్



హైదరాబాద్: పార్టీ కోసం పనిచేసేవాళ్లని కాంగ్రెస్, భారాస గుర్తించవని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ పార్టీల తీరును కార్యకర్తలు అర్థం చేసుకోవాలన్నారు. నాగోల్‌లో నిర్వహించిన భాజపా వర్క్‌షాప్‌నకు ఆయన హాజరై మాట్లాడారు. రుణమాఫీపై ప్రజల్లో చర్చ జరుగుతున్నందునే హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి రాష్ట్ర ప్రభుత్వం భయపడిందన్నారు. "కాంగ్రెస్, భాజపా ఒక్కటని భారాస.. భాజపా, భారాస ఒక్కటని కాంగ్రెస్ ఆరోపిస్తున్నాయి. ఆ రెండు పార్టీల టార్గెట్ మేమే. ప్రతి కార్యకర్త ప్రజాప్రతినిధి కావాలనే లక్ష్యంతో పనిచేయాలి. భాజపా వల్లే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. వ్యక్తులు, ప్రభుత్వాలు ఇచ్చే సూచనలతో కోర్టులు తీర్పులు, బెయిల్ ఇవ్వవు. కాంగ్రెస్‌లో భారాస కలవడం పక్కా. భారాస ప్రభుత్వం 109 కేసులు పెట్టింది. రెండు సార్లు నన్ను జైలుకు పంపింది. కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తేలేదు. ఓబీసీ నేతను దేశ ప్రధానిగా చేసింది భాజపానే. ప్రతి ఒక్కరికీ భాజపా చేసిన పనులు చెప్పి సభ్యత్వ నమోదు చేయించాలి. ప్రధాని మోదీ ప్రభుత్వం ఒక లక్ష్యంతో పనిచేస్తోంది. 370 ఆర్టికల్ రద్దు చేసిన గొప్పనేత ప్రధాని మోదీ" అని బండి సంజయ్ అన్నారు.

# మోదీజీ.. మీ నుంచి బదులు రాలేదు: మోదీకి మరో లేఖ రాసిన దీదీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి మరో లేఖ రాశారు. హత్యాచార ఘటనలకు పాల్పడేవారిని శిక్షించేందుకు కఠినచట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నిర్దిష్ట కాలపరిమితిలో కేసుల్ని పరిష్కరించేలా ఆ చట్టం ఉండాలని మరోసారి తన లేఖలో అభ్యర్థించారు. "ఈ సున్నిత అంశంపై మీనుంచి ఎలాంటి సమాధానం అందలేదు" అని పేర్కొన్నారు. తాను రాసిన లేఖపై ప్రధాని నుంచి నేరుగా సమాధానం రాకపోవడంపై విచారం వ్యక్తంచేశారు. మహిళా శిశు సంక్షేమశాఖ నుంచి బదులు వచ్చిందని చెప్పిన ఆమె.. సమస్య తీవ్రత దృష్ట్యా ఆ సాధారణ సమాధానం సరిపోదన్నారు.

హత్యాచార ఘటనపై వారం రోజుల క్రితం మోదీకి దీదీతొలిసారి లేఖ రాశారు. "దేశంలో మహిళలపై జరుగుతోన్న అత్యాచార ఘటనలను మీ దృష్టికి తీసుకురావాలనుకొంటున్నా. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా రోజుకు దాదాపు 90 అత్యాచార ఘటనలు జరుగుతుండటం భయానక పరిస్థితిని సూచిస్తోంది. ఇలాంటి చర్యలు సమాజం, దేశం విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ దురాగతాలకు ముగింపు పలకడం ద్వారా మహిళలు తాము సురక్షితంగా, భద్రంగా ఉన్నామని భావించేలా చేయడం మనందరి కర్తవ్యం. ఘోరమైన నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. సత్వర న్యాయం జరగాలంటే ఈ కేసుల విచారణ 15 రోజుల్లో పూర్తి చేయాలి" అని పేర్కొన్నారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ వేతనంపై డిప్యూటీ సీఎం కీలక ప్రకటన



హైదరాబాద్, ఆగస్టు 30: హైదరాబాద్‌ను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్టంలో నాలుగు లక్షల మంది ప్రైవేట్ ఏజెన్సీలు ఉన్నాయన్నారు. 1500 ఏజెన్సీలు పనిచెయ్యడం సంతోషమన్నారు. సెక్యూరిటీ ఏజెన్సీలు అనేక మందికి ఉపాధి కల్పించడం సంతోషమన్నారు. సెక్యూరిటీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఫిజికల్ సెక్యూరిటీలో పనిచేసే వారికి అండగా ఉంటుందన్నారు. కనీస వేతనం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సమ్మిట్ నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను పోలీస్ శాఖ ప్రోత్సహించాలన్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరానికి ప్రభుత్వం 10 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. నగర ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలు అందరు తప్పకుండ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. తెలంగాణలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశలు కల్పించాలని అన్నారు. అట్టడుగున ఉన్న ప్రజలను ఆదుకోవాలన్నారు. పోలీస్ శాఖ ప్రైవేట్ సెక్యూరిటీలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



# సీఎం రేవంత్‌ను ఆశీర్వదించిన వేములవాడ ఆలయ అర్చకులు

హైదరాబాద్, ఆగస్టు 30: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి (%జవీ =వఝుత్‌ష్ట్ర =వ౧౧ఎ%) వేములవాడ ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. శుక్రవారం సచివాలయంలో సీఎంను కలిసి అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేష్, డీఈఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, తదితరులు.. ముఖ్యమంత్రిని కలిశారు.

# అది చూసి ఏడ్చేశాను.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్, ఆగస్టు 30: సీఎం రేవంత్ పాలనా విధానాలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్ అయ్యారు. హైడ్రా అందరికీ ఒకే న్యాయం పాటించాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి కానీ.. పేదలకు ఒక న్యాయం, ధనవంతులకు ఒక న్యాయం ఉండకూడదన్నారు. పేదల పైన వెంటనే యాక్షన్ తీసుకుంటున్న హైడ్రా..దుర్గం చెరువులో తిరుపతి రెడ్డి ఇంటికి ఎందుకు వెళ్ళలేదు అని ప్రశ్నించారు.

**ఆ దృశ్యం చూసి ఏడ్చేశాను..** మహబూబ్ నగర్‌లో అంధుల కాలనీలో అధికారులు ఇళ్ళు కూలుస్తున్నపుడు శిథిలాల్లో యూనిఫామ్ వేసుకున్న ఒక అమ్మాయి తన బుక్స్ వెతుక్కుంటోంది. ఈ దృశ్యం చూసి నాకు ఏడుపు వచ్చింది. సీఎంకి ఎలా నిద్రపడుతోంది? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 మంది పోలీసులతో అంధుల కాలనీ కూల్చిన అధికారులు.. అంతే మంది పోలీసులు తిరుపతి రెడ్డి ఇంటికి వెళ్లి ఎందుకు కుల్చరు? అని ప్రశ్నించారు. పేద ప్రజలపై ప్రతీకార పాలనలాగా రేవంత్ పాలన నడుస్తోందని విమర్శించారు.

**గురుకులాలు నిర్వీర్యం..** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో గురుకులాలు నిర్వీర్యం అయ్యాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో 9 నెలలుగా విద్యాశాఖకు మంత్రి లేరని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం ఎప్పుడైనా సమీక్ష జరిపారా? అని ప్రశ్నించారు.

విద్యాశాఖపై సీఎంకు కనీస అవగాహన లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని.. విద్యార్థులకు యూనిఫామ్స్ లేవు, చలికాం వస్తుంది ఉలన్ రగ్గులు లేవు, బూట్లు ఇవ్వలేదని ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదని.. ప్రతీకార పాలన సాగుతోందని విమర్శించారు.

**ఉద్యోగాలు మానేసేలా కుట్ర..** చాలా కాలేజీల యాజమాన్యాలు ఫీజులు కట్టడం లేదనే కారణంగా మెమోలు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గురుకులాల్లో పేద విద్యార్థులు ఎంబీబీస్, ఐఐటీలు సాధించాలని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు ఏర్పాటు చేశారని.. కానీ, ఇప్పుడు వాటిని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గెస్ట్ ఫాకల్టీకి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. వాళ్లు ఉద్యోగాలు మానేసేలా ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. పేద విద్యార్థులంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కోపం అని ప్రశ్నించారు. వెంటనే గురుకుల కాలేజీల గెస్ట్ ఫాకల్టీకి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో కూడా అధ్యాపకుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యా భరోసా కింద ఒక్కో విద్యార్థికి రూ.5 లక్షలు ఇస్తామన్నారని.. ఒక్క పైసా అయినా విడుదల చేశారా? అని ప్రభుత్వాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# భాజపాలో చేరిన మాజీ సీఎం చంపాయీ సోరెన్

రాంచీ: ఝార?ండ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి చంపాయీ సోరెన్‌భాజపాలో చేరారు. భాజపా సీనియర్ నాయకుల సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఝార?ండ్ భాజపా అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ సమక్షంలో చంపాయీ సోరెన్ తన మద్దతుదారులతో కలిసి పార్టీలో చేరారు. కాషాయ పార్టీలోకి స్వాగతించిన తర్వాత సోరెన్ తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు కనిపించింది. జేఎంఎం అధినేత శిబు సోరెన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న చంపాయీ.. కొంతకాలంగా ఆ పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే, హేమంత్ సోరెన్ జైలు నుంచి విడుదలైన తర్వాత ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి చంపాయీ వైదొలగారు. సీఎం పగ్గాలు మళ్లీ హేమంత్ సోరెన్ చేతికి వెళ్లిపోయాయి. ఈ క్రమంలో సొంత పార్టీ అధినాయకత్వంపై చంపాయీ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. పార్టీలో తాను ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాల్సిన సమయం వచ్చిందని చంపాయీ ఇటీవల వాపోయారు. ఈ క్రమంలోనే భాజపా అగ్రనాయకత్వంతో భేటీ అయిన ఆయన.. జేఎంఎం ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పదవులకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఆదివాసులు, దళితులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతుందన్న చంపాయీ తాజాగా భాజపాలో చేరిపోయారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com